# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు — CELEBRATING 11TH YEAR ANNIVERSARY — ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

సంపుటి : 1 సంచిక : 112 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 28 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :112 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 28 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur






## ఇక్కడికి వచ్చిన ప్రతిసారి నాకు ఆనందంగా ఉంటుంది

- గండిపేటలో ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వార్షికోత్సవ కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- గండిపేటతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న వైనం
- పేద, అనాథ పిల్లలకు అండగా నిలిచేందుకే ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటు అని వెల్లడి
- సంస్థల నిర్వహణ ఘనత నారా భువనేశ్వరిదేనన్న ముఖ్యమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**పేద, అనాథ పిల్లలకు ఉన్నత విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే గొప్ప సంకల్పంతోనే ఎన్టీఆర్ ట్రస్ట్‌ను స్థాపించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సమాజ సేవలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సంస్థలు నేడు ఎంతో మంది విద్యార్థులకు అండగా నిలుస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వార్షికోత్సవ కార్యక్ర మంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గండిపేటతో తనకున్న అనుబంధాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "గండిపేటకు వచ్చినప్పుడల్లా నాకు చాలా

వివరాలు 2లో..



## 'రప్పా రప్పా నరుకుతాం' అంటే..
# రఫ్ఫాడిస్తాం
### వైసీపీ శ్రేణులకు అనిత వార్నింగ్



- ప్రపంచంలో ఎక్కడైనా పుట్టినరోజు కేకులను వేటకొడవళ్లు, తల్వార్లతో కట్ చేస్తారా? అని ప్రశ్నించిన అనిత
- జగన్ ఆదేశాల మేరకే జంతు బలులు జరిగాయని ఆరోపణ
- టీనేజ్ పిల్లలను ఉన్మాదులుగా చేసే ప్రయత్నం జరుగుతోందని మండిపాటు
- తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని సూచన

**పెన్ పవర్ డెస్క్:**రాజకీయ ముసుగులో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్మాదపు చర్యలుకు దిగుతున్నారంటూ రాష్ట్ర హోం మంత్రి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పుట్టినరోజు వేడుకల పేరుతో సమాజంలో హానికరమైన సంప్రదాయాలను ప్రోత్సహించడం గర్హనీయమని ఆమె పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## జగన్ ఫ్లెక్సీకి మళ్లీ జంతుబలి..
### ఏడుగురిని అరెస్ట్ చేసి విచారిస్తున్న పోలీసులు

- మేకపోతును బలి ఇచ్చి.. ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేసిన వైసీపీ శ్రేణులు
- చోడవరం గ్రామంలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- దీని వెనుక ఎలాంటి ఉద్దేశాలు ఉన్నాయనే కోణంలో విచారణ




తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం చోడవరం గ్రామంలో చోటుచేసుకున్న ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. వైసీపీ శ్రేణులు హద్దులు దాటి వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారి తీసింది. నిన్న రాత్రి వైసీపీ అధినేత జగన్ ఫ్లెక్సీ ముందు మేకపోతును బలి ఇచ్చి, ఆ రక్తంతో ఫ్లెక్సీకి అభిషేకం చేయడం తీవ్ర సంచలనంగా మారింది. '2029 గంగమ్మ జాతర రప్పారప్పా' అంటూ వీరు నినాదాలు చేశారు. అంతేకాదు, వీడియోలు

వివరాలు 2లో..



## రెండు సెకన్లలో 700 కి.మీ. వేగం...
### రవాణా టెక్నాలజీలో చైనా సంచలనం!

- మాగ్లెవ్ టెక్నాలజీలో చైనా సరికొత్త ప్రపంచ రికార్డులు
- కేవలం రెండు సెకన్లలో గంటకు 700 కి.మీ వేగం అందుకున్న రైలు
- మరో ప్రయోగంలో గంటకు 800 కి.మీ వేగంతో దూసుకెళ్లిన మోడల్
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పరీక్షలు
- హైపర్‌లూప్, ఏరోస్పేస్ రంగాల్లో ఈ టెక్నాలజీ వినియోగంపై దృష్టి
- జపాన్ పేరిట ఉన్న పాత రికార్డులను అధిగమించిన చైనా

**పెన్ పవర్ డెస్క్:**రవాణా టెక్నాలజీలో చైనా మరోసారి ప్రపం చాన్ని నివ్వెరపరిచింది. అత్యంత వేగవం తమైన మాగ్నెటిక్ లెవిటేషన్ (మాగ్లెవ్) రైళ్ల ప్రయోగాల్లో సరికొత్త ప్రపంచ రికార్డులను నెలకొల్పింది. కేవలం రెండు సెకన్ల వ్యవధి లోనే గంటకు 700 కిలోమీటర్ల వేగాన్ని అందుకుని ఒక రికార్డు సృష్టించగా, మరో ప్రయోగంలో గంటకు

వివరాలు 2లో..

## రాజధాని రైతు హఠాన్మరణం...
### రైతు కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు ఫోన్



- రాజధాని రైతు దొండపాటి రామారావు ఆకస్మిక మృతి
- మంత్రి నారాయణ సమావేశంలో గుండెపోటుతో కుప్పకూలిన వైనం
- మృతుడి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన సీఎం చంద్రబాబు
- ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కుటుంబానికి భరోసా
- కుటుంబానికి అండగా ఉండాలని మంత్రి, ఎమ్మెల్యేకు సీఎం ఆదేశం

వివరాలు 2లో..

## ఆ పథకం రద్దు చేసి పేదల కడుపు కొట్టారు

- ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశం.. హాజరైన సోనియా, రాహుల్, రేవంత్ రెడ్డి
- ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేదల కడుపు కొట్టిందని ఆగ్రహం
- దేశంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేదల కడుపు కొట్టిందని ఆరోపించారు.

వివరాలు 2లో..



## జగన్, కేసీఆర్ ఎప్పుడైనా చర్చలు జరిపారా?

- జగన్, కేసీఆర్ ఒకరింటికి మరొకరు వెళ్లి విందు భోజనాలు తిన్నారన్న జగ్గారెడ్డి
- ఇరు రాష్ట్రాల సమస్యలపై ఏనాడైనా చర్చలు జరిపారా అని ప్రశ్న
- వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై జగన్ ఎందుకు మాట్లాడటం లేదన్న జగ్గారెడ్డి

వివరాలు 2లో..






# ప్రపంచానికి దిక్సూచి చైనా

సోవిట్ సోషలిస్ట్ నమూనా పతనం అనేది చైనా కమ్యూనిస్టు పార్టీ(సిపిసి)లో పెద్ద చర్చకు దారితీసింది. సిపిసి నాయకత్వం సోవియట్ మోడల్‌ని అనుసరించకుండా మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని, చైనాస్థానిక పరిస్థితులకు వర్తింపజేసే సోషలిస్టు నమూనాను ఎంచుకుంది. "చైనా లక్షణాలతో కూడిన సోషలిజం" అనే విధానాన్ని ఎంచుకుంది. అంటే మార్క్సిజం- లెనినిజం సిద్ధాంతం వెలుగులో చైనా దేశీయ లక్షణాలతో కూడిన సోషలిజం నమూనాను అమలు చేయాలని సిపిసి నిర్ణయించు కుంది. భారతదేశానికి స్వాతంత్రం 1947 ఆగస్టు 15న వచ్చింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా 1, అక్టోబర్ 1949లో ఏర్పడింది. మన స్వాతంత్రం తర్వాత రెండు సంవత్సరాల 35 రోజులకు చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడింది. రెండు దేశాలకు అనేక పోలికలు ఉన్నాయి. కానీ చైనా అమెరికాను సవాలు చేస్తుంది. ప్రపంచ జీవన వ్యయ పోలిక (పిపిపి)ని అనుసరించి అమెరికాను చైనా అధిగమించింది. అనేక రంగాలలో అమెరికాను చైనా దాటిపోయింది. కానీ భారత్‌లో దారిద్ర్యం, ఆకలి, అన్నదాతల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, కాలుష్యం, పౌష్టికాహార లోపం, వెనక బాటుతం, విద్యారంగ దుస్థితి, పెచ్చరిల్లుతున్న నేరాలు, అనేక అసమానతలు తాండవిస్తున్నాయి. చైనా అత్యున్నత నాయకుడు డెంగ్ సియావో పింగ్ 1978లో ప్రారంభించిన "ఓపెనింగ్ అప్" కీలకమైన సంస్కరణలు చైనా సమగ్ర స్వరూపాన్ని సమూలంగా మార్చి వేశాయి. చైనా 85 కోట్ల మంది ప్రజల దారిద్ర్యాన్ని రూపుమాపింది. వారి ఆర్థిక సమగ్ర జీవన పరిస్థితులని సమూలంగా మార్చింది. ఇది ప్రపంచ మానవ అభివృద్ధిలో అసాధారణమైనది. 30 ఏండ్ల క్రితం ఆదేశ జనాభాలో 66శాతం ప్రజలు అత్యంత పేదరికంలో జీవించారు. అలాంటిది 2020 నాటికి చైనా ఆ దేశంలోని దారిద్ర్యాన్ని సంపూర్ణంగా నిర్మూలిం చింది. మొత్తం ప్రపంచ మానవాళి చరిత్రలో చైనా ప్రజల పేదరిక నిర్మూలన చారిత్రాత్మకమైన ఘట్టం. ఆశ్చర్యకరమైనదనీ ప్రపంచ ప్రముఖులు వర్ణిస్తున్నారు.అనేక దశాబ్దాలుగా ఆటోమొబైల్‌ను ఏలిన అమెరికా పచ్చిమయూరప్ ఆటో ఇండిస్ట్రీ చైనా పోటీకి బీటలు బారుతోంది. మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో..స్టీల్ ఉత్పత్తిలో 53.9శాతం, సిమెంట్ ఉత్పత్తిలో 51.1శాతం, ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లో 20- 30శాతం ఒక్క చైనాయే ఉత్పత్తి చేస్తున్నది. ప్రపంచంలోనీ హై స్పీడ్ రైల్ లైన్ మొత్తంలో ఒక్క చైనా 66శాతం కలిగి ఉంది. ప్రపంచ భారీ ఓడల నిర్మాణంలో చైనా ఒకటే 51శాతం నిర్మిస్తోంది. ప్రపంచ సముద్ర జలాల్లోకి వెళ్లే కొత్త భారీ ఓడల్లో సగం చైనా నిర్మించినవే. అవి కూడా ఏ దేశం నిర్మించనంత చౌకగా, నాణ్యంగా, గొప్ప సాంకేతికతతో చైనా నిర్మిస్తున్నది. రెండు దశాబ్దాల క్రితం ఓడల నిర్మాణంలో చిరునామాలేని చైనా దెబ్బకు అమెరికా పశ్చిమ యూరప్ షిప్ బిల్డింగ్ పరిశ్రమ కూలిపోగా, సౌత్ కొరియా జపాన్‌లు ఎదురీదుతున్నాయి. ఇండియా ఎక్కడో అడుగున ఉంది. సముద్ర జల రవాణాను వ్యూహాత్మకంగా విప్లవాత్మకంగా మార్చింది చైనా. అమెరికాను చైనా అనేక రంగాల్లో అధిగమించింది. మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 30 శాతం కేవలం చైనాదే అంటే ఆ దేశ ప్రగతి ఎంత వేగంతో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఆధిపత్యంలేని, అందరికీ సమానమైన న్యాయమైన బహుళ ధ్రువ ప్రపంచ వ్యవస్థ నిర్మాణం కొరకు, మంచి మార్పుల కోసం ఒక ప్రభల శక్తిగా చైనా నిలబడింది. అమెరికా ఇంగ్లాండ్ పశ్చిమ యూరోప్, జపాన్ లాంటి ఆధిపత్య వలసవాదానికి పూర్తి వ్యతిరేకమైన ఒక బలమైన మృదువైన శక్తిగా దక్షిణ ఆఫ్రికా ఖండ, దక్షిణ అమెరికా, ఆసియా, పశ్చిమ ఆసియా, సెంట్రల్ ఆసియా దేశాలతో కలిసి నిలబడింది. మానవీయ జీవన విలువల ప్రమాణాన్ని నిర్ణయించడం కోసం ప్రపంచంలో ఎక్కడా లేని "సోషల్ క్రెడిట్ సిస్టం(ఎస్‌సిఎస్)" ను చైనా నెలకొల్పింది. 700 మిలియన్ల ఫేషియల్ రికగ్నిషన్‌ను గుర్తించే శక్తివంతమైన కెమెరాలు దేశ ప్రజలతో పాటు, ఇతర దేశాల పర్యాటకులను పర్యవేక్షించి నియంత్రిస్తున్నాయి. చైనా తన ప్రజల్లో సామాజిక సామరస్యాన్ని నెలకొల్పుతున్నది. నేరాల రేటు గణనీయంగా పడిపోయింది. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచంలో సురక్షితమైన దేశంగా గత రెండు దశాబ్దాల్లో చైనా మొదటి శ్రేణిలో నిలుస్తున్నది. 1990లో చైనా 170 పట్టణాలను కలిగి ఉండేది. నేడు అవి 700లకు పెరిగాయి. 17 మెగా సిటీలున్నాయి. షేన్జెన్ అనే ఒక చిన్న చేపలు పట్టే పట్టణం నేడు ప్రపంచానికి సిలికాన్ వాలీగా మారింది. డెంగ్ సియాఓ పింగ్ 'ఓపెనింగ్ అప్' చేసిన నాలుగు దశాబ్దాలలోనే చైనాలో ప్రపంచ మానవాళిని సమ్మోహన పరిచేలా, కండ్లు మిరుమిట్లు గొలిపేలా, అద్భుతమైన అభివృద్ధి జరిగింది. వీటన్నింటికీ ఒక్కటే సమాధానం. చైనాను అన్ని రంగాలలో ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాలనే దృఢమైన సంకల్పం గల విప్లవాత్మక నాయకత్వానికి ఆ కీర్తి దక్కుతుంది. డెంగ్ సియాఓ పింగ్ "ఓపెనింగ్ అప్"తో, అమెరికా, పశ్చిమ, వివిధ దేశాల పెట్టుబడి దారులు చౌకైన శ్రమను కొల్లగొట్టడంకై తమ పరిశ్రమలన్నీ చైనాకు తరలించాయి. షరతు ప్రకారం కీలక సాంకేతికతలన్నీ చైనా గుప్పిట్లోకి వచ్చాయి. చైనా ప్రపంచ ఫ్యాక్టరీగా మారింది. ప్రపంచ ప్రజలు వినియోగించే 30శాతం పైగా వస్తువులు చైనా దేశానివే అంటే అతిశయోక్తి కాదు. చైనా విద్యుత్ వినియోగం చూస్తే కండ్లు తిరిగిపోతాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇండియా, రష్యా, జపాన్ అన్నీ కలిసి ఎంత వినియోగిస్తాయో అంతకంటే ఎక్కువ కరెంటును చైనా వినియోగిస్తుంది. చైనా హైడ్రో పవర్ దాని పరిశ్రమకు వెన్నెముకగా ఉంది. 436 గిగా వాట్ కెపాసిటీ ప్రపంచంలోనే అతి పెద్దదిగా ఉంది. త్రీ గార్జెస్ డ్యామ్ ఒకటే 22,500 మె.వా. కాలుష్య రహిత విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద, తన రికార్డును తానే తిరగరాస్తున్న చైనా త్రీ గార్జెస్ కంటే రెండింతల పెద్ద "మెడోగ్ హైడ్రో పవర్ స్టేషన్" (60 వేల మె.వా.)నిర్మాణం ప్రారంభించింది. ప్రకృతి హితమైన "నూతన ఉత్పత్తి శక్తులను నిర్మించడమే చైనా ఏకైక లక్ష్యంగా ఉంది". బొగ్గు విద్యుత్ వినియోగం ఇప్పటికీ గణనీయమైన 58శాతం అయినప్పటికీ, వేగంగా బొగ్గు ఆధారిత విద్యుత్తును తగ్గిస్తున్నది. న్యూక్లియర్ ఫ్యూజన్(కేంద్రక సంలీనం)తో సూర్యుడిలోని స్వచ్ఛమైన విద్యుత్తు ఉత్పత్తి ప్రక్రియను ఒక ఫ్యాక్టరీ రూపంలో చైనాలో నిర్మిస్తోంది. అది పూర్తయితే ప్రకృతికి హానిలేని అనంతమైన విద్యుత్తు అందుబాటులోకి వస్తుంది. ఇలా చైనా నూతన ఉత్పత్తి శక్తులను భారీ ఎత్తున అభివృద్ధి చేస్తోంది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తు అవసరాలకు సరిపడా విద్యుత్తును ఉత్పత్తి చేయడం చైనా లక్ష్యంగా పెట్టుకుంది. 2025కు 200 టెర్రావాట్ హావర్, 2030 కల్లా 600 టెర్రవాట్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలని చైనా లక్ష్యం. ఒక్క 2024 లోనే చైనా 429 గిగా వాట్ విద్యుత్తును కొత్తగా చైనా ఉత్పత్తి చేసింది. కానీ ఇదే సమయంలో అమెరికా 51 గిగా వాట్ విద్యుత్తును మాత్రమే ఉత్పత్తి చేసింది. ఆర్టిఫిషియల్‌ఇంటలిజెన్స్(ఎఐ)డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లకు నిరంతర విద్యుత్తు భారీ ఎత్తున అవసరం. ఏఐ రేసులో అమెరికా కంటే అన్ని దేశాల కంటే ముందున్న చైనా, గెలుపు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నది. 2024లో చైనా 9,852 టిడబ్ల్యూహెచ్ విద్యుత్తును వినియోగించింది. అంటే.. ఆసియా ఖండంలోని మొత్తం దేశాల విద్యుత్ డిమాండ్‌లో సగానికి పైగా ఒక్క చైనానే వినియోగించింది. 2025 చివరి నాటికి 10,498 టిడబ్ల్యూహెచ్‌కి చేరుకుంటుంది.

సాంకేతిక రంగంలో అత్యున్నత స్థాయి ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్ ప్రాతిపదికగా 2024లో చైనా ప్రభుత్వం పరిశోధనలకు 570 బిలియన్ డాలర్లు కేటాయించింది. సాఫ్ట్‌వేర్ నుండి హార్డ్‌వేర్‌తో రోబోట్ల ద్వారా అన్ని రంగాలలో మార్కెట్‌కు అనుగుణమైన బిజినెస్ మోడల్ తయారీ కొరకు కొత్త భాగస్వాములు, పెట్టుబడిదారులతో కూడిన ఉత్పత్తి కార్యకలాపాలను చైనా ప్రారంభించింది. ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో రెండువందల కంపెనీలు పనిచేస్తున్నాయి. ప్రపంచంలోనే పేరెన్నికగన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలు చైనాలో ఐదు వేలు ఉన్నాయని ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. చైనా అభివృద్ధి నమూనా అనేది ఇతర దేశాలకు గుడ్డిగా ఎగుమతి చేసే సార్వత్రిక నమూనా కాదని సిపిసి నాయకత్వం కుండబద్దలు కొట్టినట్టు చెపున్నది. ప్రతి దేశం తన దేశీయ (శీతోష్ణస్థితి, భౌగోళిక, సాంస్కతిక, జీవవైవిధ్య, వాతావరణ, చరిత్ర) అనేక పరిస్థితు లకు అనువైన వైవిధ్యపూరితమైన విధంగా నిర్ణయించుకోవాలని, గుడ్డిగా అనుసరించవద్దని సిపిసి పేర్కొంటున్నది. చైనా ప్రతియేటా ఏడు మిలియన్ల కాలేజీ గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేస్తుంది. చైనాలో ఎస్‌టిఈఎం (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీ రింగ్, మ్యాథ్స్) విద్యార్థులు ప్రతియేటా ఐదు మిలియన్ల మంది బయటికి వస్తున్నారు. అమెరికాలో కేవలం ఎనిమిది లక్షల మంది ఎస్‌టిఈఎం విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసుకుంటున్నారు. ఒక మిలియన్ విద్యార్థులు చైనా కమ్యూనిస్టు పార్టీలో చేరుతున్నారు. పార్టీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ అత్యంత పోటీతో కూడుకుని ఉంటుంది. మార్క్సిజం పట్ల సైద్ధాంతిక నిబద్ధత, అత్యంత ప్రతిభ, కష్టపడి పని చేసే విలువలతో కూడిన మచ్చలేని వారిని సిపిసి ఎన్నుకుంటుంది. చైనా వ్యవసాయ పరిశ్రమలో ప్రపంచ ప్రమాణాలతో కూడిన ఆధునీకరణ (మోడ్రనైజేషన్) 2012లో 57 శాతం అయితే, 2021లో 72 శాతానికి చేరింది. ఎరువులు, పురుగుమందులు చల్లడం, ట్రాక్టర్లు దున్నడం, నాట్లు వేయడం మనుషులు లేకుండా స్వయం చాలిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అత్యాధునిక సాంకేతిక యంత్రాలతో జరుగుతున్నది. శిలాజ ఇంధనాలు లేని, స్వచ్ఛమైన బ్యాటరీ విద్యుత్తుతో నడిచే స్వయం చాలిత యంత్రాల ఉత్పత్తి మమ్మరంగా జరుగుతుంది. డ్రైవర్ లేకుండా వరి నాటు పెట్టే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యంత్రం రోజుకు 17 ఎకరాలకు పైగా ఖచ్చితమైన కొలతతో నాటు వేస్తుంది. డ్రైవర్ లేకుండా "బైడు సాటిలైట్"తో నడిచే ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు పూర్తి ఆటోమేటెడ్ (స్వయం చాలితమైన)వి సాధారణ ట్రాక్టర్ల కంటే 50శాతం అధిక సామర్థ్యం కలవి. నిపుణులైన మనుషుల కంటే కూడా దీని వ్యవసాయ పని నిర్వహణ కచ్చితత్వంతో కూడుకొని ఉంటుంది. చైనాలో నేడు ధాన్యం తలసరి ఉత్పత్తి అంతర్జాతీయ స్థాయిని దాటింది. ం

# 'రప్పా రప్పా నరుకుతాం' అంటే.. రఫ్ఫాడిస్తాం

- మొదటి పేజి తరువాయి

వైసీపీ అధినేత జగన్ పుట్టినరోజు వేళ కార్యకర్తలు జగన్ ఫ్లెక్సీ వద్ద మేకను బలివ్వడంపై ఆమె మండిపడ్డారు.నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సాధారణంగా పుట్టినరోజు అంటే అన్నదానం చేయడం, రోగులకు పళ్ళు, రొట్టెలు పంచడం, రక్తదానం చేయడం లేదా గుడిలో పూజలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తారు. కానీ వైసీపీ నాయకులు దీనికి భిన్నంగా రౌడీయిజానికి బలాన్ని ఇచ్చేలా ప్రవర్తిస్తున్నారు. కేక్ కట్ చేయడానికి చిన్న ప్లాస్టిక్ కత్తి వాడటం మన సంప్రదాయం. కానీ వైసీపీ శ్రేణులు కొడవళ్ళు, వేటకొడవళ్ళు, పెద్ద పెద్ద కత్తులతో కేక్ కట్ చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. "రప్పా రప్పామని నరుకుతాం.. 2029లో ఇదే రిపీట్ అవుతుంది" అంటూ నినాదాలు చేయడం వారి నేరపూరిత ఆలోచనలకు అద్దం పడుతోందని అన్నారు. వేడుకల పేరుతో ఇష్టానుసారంగా టపాసులు కాల్చుతుంటే, ఇబ్బంది కలిగి పక్కకు వెళ్లమని కోరిన ఒక గర్భిణీ స్త్రీని కడుపుపై కాలితో తన్నడం వారి ఉన్మాదానికి పరాకాష్ఠ అని దుయ్యబట్టారు.

కళ్యాణదుర్గం, ఉరవకొండ, సింగనమల, రాప్తాడు, కుప్పం వంటి 10కి పైగా నియోజకవర్గాల్లో ఒకే రోజు, ఒకే తరహాలో జంతు బలులు, రక్తాభిషేకాలు జరిగాయంటే.. ఇది జగన్ ఆదేశాల మేరకు జరిగిన వ్యవస్థీకృత నేరమేనని స్పష్టమవుతోందని ఆరోపించారు. మాజీ మంత్రులు పక్కనే ఉండి ప్రోత్సహిస్తుంటే, కార్యకర్తలు మేకల తలలు నరికి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా వైసీపీ నేతలు రోజురోజుకు మరింత దిగజారుతున్నారని విమర్శించారు. టీనేజ్ పిల్లలను రెచ్చగొట్టి, సైకోలు, ఉన్మాదుల్లా మార్చే ప్రయత్నం జరుగుతోందని, ఇది చాలా ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. కనీసం పిల్లల తల్లిదండ్రులైనా తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని సూచించారు.

వైసీపీ శ్రేణులు ఎలాంటి తప్పులు చేసినా ఆ పార్టీ నాయకుడు జగన్ నోరు తెరిచి వాటిని ఖండించడం లేదని అనిత తీవ్రంగా తప్పుబట్టారు. ఆస్తి కోసం సొంత తల్లి, చెల్లెలిపై కేసులు పెట్టిన వ్యక్తి మీ పిల్లలను రక్షిస్తాడా? అని ప్రశ్నించారు. తమ పార్టీ నేతల తప్పులను తప్పుగా చెప్పే నైతిక ధైర్యం జగన్‌కు లేదా? అని నిలదీశారు. రాష్ట్ర శాంతి భద్రతలకు భంగం కలిగించే ఇలాంటి చర్యలను ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు.

"ఇక్కడ అధికారంలో ఉన్నది చంద్రబాబు గారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. రోడ్ల మీద కత్తులు, కొడవళ్లు పట్టుకుని

"రప్పా రప్పా నరుకుతాం" అని తిరిగే ఉన్మాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం. ఫ్లెక్సీలపై రక్తాభిషేకాలు చేసిన ప్రతి ఒక్కరి జాతకం మా దగ్గర ఉంది. గతంలోలాగా ముసుగులేసి దాచడం కాదు.. ప్రతి నేరస్థుడిని రోడ్డు మీద నిలబెట్టి ప్రజలకు చూపిస్తాం. రౌడీయిజం చేస్తామంటే మా డిపార్ట్మెంట్ సిద్ధంగా ఉంది. ఇప్పటికే రౌడీ షీటర్లను రోడ్ల మీద నడిపిస్తున్నాం. పరిస్థితి విషమిస్తే, అరాచక శక్తులను రాష్ట్ర బహిష్కరణ చేయడానికి కూడా వెనుకాడం. ముఖ్యమంత్రి గారి ఆదేశాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. మీ బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని మేము 'స్కిల్ డెవలప్మెంట్' సెంటర్లు పెడుతుంటే, జగన్ వారి చేతికి కత్తులు ఇస్తున్నారు. రప్పా రప్పా అని గీత దాటితే కటకటాలు తప్పవు" అని హెచ్చరించారు.

# జగన్, కేసీఆర్ ఎప్పుడైనా చర్చలు జరిపారా?

ఏపీ, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రులు జగన్, కేసీఆర్‌పై తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. గతంలో కేసీఆర్ జగన్ ఇంటికి వచ్చి చేపలు తిన్నారని, జగన్ హైదరాబాద్‌లో కేసీఆర్ ఇంటికి వచ్చి కోడికూర తిన్నారని అన్నారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి ఇలా దిగజారి వ్యవహరించరని చెప్పారు. ఇరు రాష్ట్రాల సమస్యలపై గతంలో జగన్, కేసీఆర్ ఎప్పుడైనా చర్చలు జరిపారా? అని ప్రశ్నించారు. వారిని మీడియా ప్రతినిధులు ఎందుకు ప్రశ్నించడం లేదని అడిగారు. రెండు రాష్ట్రాలు బాగుండాలనేదే తన ఆకాంక్ష అని చెప్పారు. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను ఉన్నతస్థాయిలో చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నీటి ప్రాజెక్టులు, కేటాయింపుల వంటి అంశాలపై సీఎంలు ప్రత్యక్షంగా కూర్చుని చర్చించాలన్నారు."విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు. ప్రజల భాగస్వామ్యంతో ఉక్కు కర్మాగారం ఏర్పాటు అయ్యింది. 1970లో ఇందిరాగాంధీ పార్లమెంటులో ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. రూ.14,000 కోట్లు వ్యయం చేసి స్థాపించిన ఫ్యాక్టరీ వల్ల విశాఖపట్నం అభివృద్ధి చెందింది. వేలు, లక్షల కుటుంబాలు ఉక్కుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆనాటి ఉద్యమం కారణంగా ఎంతోమంది నాయకులుగా ఎదిగారు. వెంకయ్య నాయుడు కూడా ఉద్యమం ద్వారా జాతీయ స్థాయి నేతగా అవతరించారు" అని జగ్గారెడ్డి చెప్పారు."యూపీఏ ప్రభుత్వంలో నష్టాలను భర్తీ చేస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడుతూ వచ్చారు. ఇప్పుడు మోదీ ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నట్లు కనిపిస్తుంది. రెండు లక్షల కోట్ల విలువ చేసే విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేట్ కు కట్టపెట్టేలా కుట్రలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు జగన్ ఎందుకు మాట్లాడటం లేదు?" అని ప్రశ్నించారు.

# ఇక్కడికి వచ్చిన ప్రతిసారి నాకు ఆనందంగా ఉంటుంది

- మొదటి పేజి తరువాయి

ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు ఇదే ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం ఉండేది. ఎంతో మంది రాజకీయ నాయకులకు ఇక్కడ శిక్షణ ఇచ్చాం. ఇప్పుడు అదే స్థలంలో వివిధ కారణాల వల్ల అనాథలుగా మారిన పిల్లలకు విద్యను అందిస్తుండటం సంతృప్తినిస్తోంది. సమాజంలో ఎవరూ అనాథలు కాకూడదనే ఉద్దేశంతో, వారికి పెద్ద దిక్కుగా నిలవాలనే లక్ష్యంతో అప్పుడు నాటిన చిన్న మొక్క ఇప్పుడు మహావృక్షంగా ఎదిగింది" అని ఆయన పేర్కొన్నారు.ఎన్టీఆర్ విద్యా సంస్థలను ఉన్నత ప్రమాణాలతో, సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఘనత పూర్తిగా నారా భువనేశ్వరికే చెందుతుందని చంద్రబాబు ప్రశంసించారు. ఆమె పర్యవేక్షణ వల్లే సంస్థలు ఇంతగా అభివృద్ధి చెందాయని కొనియాడారు. ఈ సంస్థల నుంచి చదువుకున్న నలుగురు విద్యార్థులు గ్రూప్-1 పోస్టులకు ఎంపికయ్యారని, 29 మంది ప్రతిష్టాత్మక ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించారని తెలపడం గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం వివిధ కేంద్రాల్లో 1,641 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, చిన్న పాఠశాలగా మొదలైన ప్రస్థానం నేడు ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల స్థాయికి విస్తరించిందని వివరించారు.గతంలో తన చొరవ వల్లే హైదరాబాద్ ఉన్నత విద్యకు, ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చంద్రబాబు అన్నారు. హెరిటేజ్ సంస్థను స్థాపించినప్పుడు దాని బాధ్యతలు చేపట్టేందుకు భువనేశ్వరి మొదట అంగీకరించలేదని, కానీ ఆ తర్వాత ఎంతో సమర్థవంతంగా నిర్వహించారని గుర్తుచేశారు.

"గతంలో హైటెక్ సిటీ నిర్మించి ఐటీ రంగాన్ని ప్రోత్సహించాం. అదే స్ఫూర్తితో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను నెక్స్ట్ జెనరేషన్ టెక్నాలజీలకు చిరునామాగా మార్చబోతున్నాం. డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్ల తయారీ, డ్రోన్, స్పేస్ టెక్నాలజీలకు ఏపీని హబ్‌గా తీర్చిదిద్దుతాం" అని తన భవిష్యత్ ప్రణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండు సెకన్లలో 700 కి.మీ. వేగం...

- మొదటి పేజి తరువాయి

800 కిలోమీటర్ల వేగాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. ఈ విజయాలతో హై-స్పీడ్ రవాణా రంగంలో చైనా తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది.చైనా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ (చీఖఃఃు) పరిశోధకులు ఈ అద్భుత విజయాన్ని సాధించారు. సుమారు ఒక టన్ను బరువున్న సూపర్ కండక్టింగ్ ఎలక్ట్రిక్ మాగ్లెవ్ టెస్ట్ వాహనాన్ని 400 మీటర్ల పొడవైన ట్రాక్‌పై పరీక్షించారు. ఈ ప్రయోగంలో వాహనం కేవలం రెండు సెకన్లలోనే గంటకు 700 కిలోమీటర్ల వేగాన్ని అందుకొని, అంతే సురక్షితంగా ఆగింది. అతివేగవంతమైన ఎలక్ట్రోమాగ్నెటిక్ ప్రొపల్షన్, సస్పెన్షన్ గైడెన్స్, హై-ఫీల్డ్ సూపర్ కండక్టింగ్ మాగ్నెట్స్ వంటి కీలక సాంకేతిక సవాళ్లను అధిగమించినట్లు చైనా అధికారిక మీడియా సంస్థ సీసీటీవీ తన కథనంలో పేర్కొంది.ఇదిలా ఉండగా, వుహాన్‌లోని ఈస్ట్ లేక్ లేబొరేటరీ కూడా మరో ప్రపంచ రికార్డును ప్రకటించింది. గత నవంబర్ 24న నిర్వహించిన ఈ పరీక్ష వివరాలను తాజాగా వెల్లడించింది. ఈ ప్రయోగంలో 1,110 కిలోల బరువున్న హై-స్పీడ్ రైల్ మోడల్‌ను 5.3 సెకన్లలో గంటకు 800 కిలోమీటర్ల వేగానికి చేర్చినట్లు తెలిపింది. భవిష్యత్ హై-స్పీడ్ రవాణా వ్యవస్థలకు భద్రతా ప్రమాణాలను నిర్ధారించడంలో ఈ ప్రయోగం పునాదిగా నిలుస్తుందని ల్యాబ్ ఒక ప్రకటనలో తెలిపింది.

### జపాన్ రికార్డు బద్దలు

చైనా ఈ కొత్త రికార్డులతో.... 2015లో జపాన్ నెలకొల్పిన రికార్డును అధిగమించినట్లయింది. అప్పట్లో జపాన్‌కు చెందిన ఎల్0 సిరీస్ మాగ్లెవ్ రైలు సిబ్బందితో కలిసి గంటకు 603 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తాజా ప్రయోగాలు సిబ్బంది లేకుండా జరిపినప్పటికీ, వేగం విషయంలో జపాన్‌ను చైనా అధిగమించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ ఇండస్ట్రీ కార్పొరేషన్ (జూూ×జ) తమ 'టి-ఫ్లైట్' ట్రైన్‌ను వాక్యూమ్ ట్యూబ్‌లో గంటకు 623 కిలోమీటర్ల వేగంతో పరీక్షించడం గమనార్హం.

### భవిష్యత్ లక్ష్యాలు

ఈ ప్రయోగాలు కేవలం రైళ్ల వేగానికి మాత్రమే పరిమితం కాదని నిపుణులు భావిస్తున్నారు. వాక్యూమ్-పైప్‌లైన్ రవాణా (హైపర్‌లూప్) వ్యవస్థల అభివృద్ధికి, అలాగే ఏరోస్పేస్ రంగంలో ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఈ టెక్నాలజీని ఉపయోగించే అవకాశాలను చైనా అన్వేషిస్తోంది. జూూ×జ చేపట్టిన టి-ఫ్లైట్ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం ఉన్న 2 కిలోమీటర్ల ట్రాక్‌ను 60 కిలోమీటర్లకు పెంచి, గంటకు 1,000 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అయితే, ఈ రికార్డులకు సంబంధించిన ప్రకటనలు చైనా ప్రభుత్వ అనుబంధ మీడియా సంస్థల ద్వారా వెలువడ్డాయని, స్వతంత్ర సంస్థల నుంచి ఇంకా ధృవీకరణ రావాల్సి ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

# రాజధాని రైతు హఠాన్మరణం... రైతు కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు ఫోన్

రాజధాని ప్రాంతంలో జరిగిన ఓ విషాద ఘటనలో మరణించిన రైతు దొండపాటి రామారావు కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.వివరాల్లోకి వెళితే, తుళ్లూరు మండలం మందడంలో ఎన్-8 రహదారి అంశంపై శుక్రవారం మంత్రి పొంగూరు నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ రైతులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న దొండపాటి రామారావు అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయారు.ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, శనివారం రామారావు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా నిలుస్తుందని వారికి భరోసా ఇచ్చారు. రామారావు కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని, వారికి అండగా ఉండాలని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌ను ఆయన ఆదేశించారు. రైతు సమావేశంలో ఈ దురదృష్టకర ఘటన జరగడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు.

# జగన్ ఫ్లెక్సీకి మళ్లీ జంతుబలి..

- మొదటి పేజి తరువాయి

తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం మరింత వివాదాస్పదమైంది. ఈ వీడియోలు వైరల్ కావడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.

విషయం తీవ్రతరమవడంతో ఈ ఉదయం తూర్పుగోదావరి పోలీసులు చోడవరం గ్రామానికి చేరుకున్నారు. ఘటనకు సంబంధించి ఏడుగురు వైసీపీ నేతలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వీడియోలు చిత్రీకరించిన వారు ఎవరు? వెనుక ఎలాంటి ఉద్దేశాలు ఉన్నాయి? అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. యువత ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని, రాజకీయాల పేరుతో తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మరోవైపు, వీరిపై జంతు హింస చట్టం కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఇటీవల జగన్ పుట్టినరోజు సందర్భంగా కూడా పలు చోట్ల జగన్ ఫ్లెక్సీల ముందు వైసీపీ శ్రేణులు జంతు బలులు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి అనేక చోట్ల వైసీపీ కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి.

# ఆ పథకం రద్దు చేసి పేదల కడుపు కొట్టారు

- మొదటి పేజి తరువాయి

దీనిపై దేశవ్యాప్త ప్రజా ఉద్యమానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత శశిథరూర్ సహా పలువురు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉందని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ)ను రద్దు చేసి పేదల కడుపు కొట్టారని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి పేదల కంటే కార్పొరేట్ సంస్థలకే ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏను ఆయన వ్యవసాయ చట్టాలతో పోల్చారు. నాడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్నట్లుగా, ఉపాధి హామీ చట్టం రద్దుకు వ్యతిరేకంగా కూడా ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పౌరుల హక్కులకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించడానికి నాటి యూపీఏ ప్రభుత్వం ముందుచూపుతో గ్రామీణ ఉపాధి పథకాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు.

పెన్ పవర్
ప్రకాశం

# గుప్త నిధుల కోసం నంది చుట్టూ త్రవ్వారా ?



**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 27**

రాచర్ల మండలం ఎడవల్లి లో పురాతనమైన ఉమామహేశ్వర ఆలయంలోశుక్రవారం రాత్రి నందీశ్వరుడి విగ్రహం చుట్టూ గుర్తు తెలీని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లుగా గ్రామస్తులు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది.

# బాల్యవివాహాలు బాలికల ఉజ్వల భవిష్యత్తుకు శాపాలు కాకూడదు

**బాల్య వివాహాల నిరోధానికి అందరి సహకారం అవసరం- ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి.**

**కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్వైజర్ వసంతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం.**

**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 27**

బాల్య వివాహాలు బాలికల ఉజ్వల భవిష్యత్తుకు శాపాలు కారాదని, అందువల్ల తల్లిదండ్రులు అన్ని వర్గాల ప్రజలు బాల్య వివాహాల నిరోధానికి కృషి చేస్తూ మన రాష్ట్రాన్ని బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలని కొమరోలు ఎస్సై జె నాగరాజు తెలిపారు. కొమరోలు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం గిద్దలూరు సిడిపిఓ ఆదేశాలతో కొమరోలు ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత కుమారి ఆధ్వర్యంలో బాల్యవివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ఆ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అధ్యక్షత వహించగా, ఎస్సై నాగరాజు, ఎంపీడీవో ఎస్ సత్యం, ఎంఈఓ వెంకటేశ్వర్లు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిరోధించేందుకు మహిళా పోలీసులు, పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారని, అంతేకాక అన్ని శాఖల అధికారులు, అన్ని వర్గాల ప్రజలు బాల్యవివాల నిరోధానికి తమ వంతు తోడ్పాటు అందించాలని కోరారు. బాల్య వివాహాలను జరిపిస్తున్న రెండు కుటుంబాల తల్లిదండ్రులపై, వారికి సహకారం అందించిన బంధువులతో పాటు పురోహితులపై కూడ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎంపీడీవో సత్యం మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి బాలికల తల్లిదండ్రులలో పెను మార్పులు రావాలని, వారి ఆలోచన విధానం పూర్తిగా మారాలని, అందుకు తల్లిదండ్రులను చైతన్య పరచవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత కుమారి మాట్లాడుతూ, బాల్య వివాహాల నిరోధానికి మాతా శిశు సంక్షేమ శాఖ ఎంతగానో కృషి చేస్తున్నదని, అంగన్వాడి కార్యకర్తలు సమాజం పై దృష్టి ఉంచి బాల్య వివాహాల నిరోధానికి తమ



వంతుగా కృషి చేస్తున్నారని బాల్య వివాహాలు జరిగే సంఘటనలు తెలుసుకుంటూ వాటిని నిరోధించేందుకు కృషి చేస్తూనే, తమకు సమాచారం అందిస్తున్నారని, ఆ మేరకు గిద్దలూరు సిడిపిఓ ఆధ్వర్యంలో తాము పోలీసులు, పలు శాఖల అధికారుల సహకారంతో బాల్య వివాహాలను అడ్డుకుంటూ వాటిని నిరోధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అయినప్పటికీ రహస్యంగా బాల్య వివాహాలు జరుగుతూ ఉండటం విచారకరమన్నారు. తల్లిదండ్రులు చిన్న వయసులోనే తమ బాలికలకు వివాహం జరిపించి బరువు తగ్గించుకోవాలనే ఆలోచనతో ఉన్నారని, అయితే బాలికలకు చిన్న వయసులోనే వివాహాలు జరిపించడం వల్ల వారికి ఆరోగ్యపరంగా, మానసికంగా శారీరకపరంగా కలిగే సమస్యను ఇబ్బందులపై తల్లిదండ్రులు ఆలోచించకపోవడం శోచనీయమన్నారు. బాలికల భవిష్యత్తును తీర్చిదిద్దవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదనే వాస్తవాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. బాల్య వివాహాలను నిర్వహించి బాలికలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి, అమలు చేస్తున్న పథకాలు గొప్పగా ఉన్నాయని అంటూ, బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించి రాష్ట్రాన్ని బాల్య వివాహరహిత ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు. ఆ సందర్భంగా ఆమె బాల్య వివాహాల వలన బాలికలకు ఎదురయ్యే సమస్యలను వివరించి బాలికలకు అవగాహన కల్పిస్తూ, బాల్య వివాహాలకు ఉత్సాహం చూపిస్తున్న తల్లిదండ్రుల ఆలోచన విధానాన్ని ముందుగానే పసికట్టి బాలికలు తల్లిదండ్రులను ఎదిరించాలని ,అక్కడికి వారు మనసు మార్చుకోకపోతే చదువుకుంటున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు, అంగన్వాడి కార్యకర్తలకు, మహిళా పోలీసులకు తెలియజేసి, బాల్య వివాహాల నుంచి విముక్తి పొందాలని ఆమె బాలికలను కోరారు.కార్యక్రమంలో మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులు, కొమరోలు పోలీస్ స్టేషన్ మహిళ పోలీసులు, ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు . కార్యక్రమం ముగిసిన తర్వాత ఎస్సై నాగరాజు, ఎంపీడీవో సత్యం ,ఆ పాఠశాలలో అమలు జరుగుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సందర్భంగా వంట నిర్వాహకులకు, విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

# ఎడమ కళ్ళు, నల్లగుంట్ల రెవెన్యూ గ్రామాలలో రి సర్వే గ్రామసభలు

**రీ సర్వేపై రైతులుకు అవగాహన కల్పించిన తాసిల్దార్ భాగ్యలక్ష్మి, మండల సర్వేయర్ జమాల్**




**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 27**

కొమరోలు మండలం ఎడమ కళ్ళు, నల్లగుంట్ల రెవెన్యూ గ్రామాలలో నిర్వహించ తలపెట్టిన ఫేస్ ఫోర్ రీ సర్వే కార్యక్రమాలపై శనివారం కొమరోలు తాసిల్దార్ డి భాగ్యలక్ష్మి ,ఇన్చార్జి మండల సర్వేయర్ జమాల్ రైతులకు అవగాహన కల్పించారు. ఫేస్ ఫోర్ ద్వారా రీ సర్వే నిర్వహించుటకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాసిల్దారు భాగ్యలక్ష్మి చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా సదరు రెండు గ్రామాల రైతులకు రీసర్వే పై అవగాహన కల్పించేందుకు శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఎడమకళ్లు రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తాసిల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొని రైతులకు రి సర్వే వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అందువల్ల రైతులు రీ సర్వే సమయంలో పొలాలలో అందుబాటులో ఉండాలన్నారు. తద్వారా వారి సందేహాలను, సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆ సందర్భంగా గ్రామాలలో ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. నల్లగుంట్ల రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మండల ఇన్చార్జి సర్వే షేక్ జమాల్ రైతులకు రీ సర్వేపై అవగాహన కల్పించారు. ఆ కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలి

**జిల్లా ఉద్యానవన అధికారి గోపీచంద్**



**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 27**

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్ చెప్పారు. శనివారం నాడు ఆయన మండలంలోని కుంచేపల్లి గ్రామంలో రైతులు పండిస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ గ్రామంలోని దానిమ్మ తోటలను పరిశీలించి, వాటి సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అలాగే పండ్ల తోటలు సాగు చేసే రైతులు మొక్కల ఎంపిక, వాటికి సంబంధించిన మెళుకువలు, నీటి యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులు తదితరవాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ధనలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీరామ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 35 మంది మందుబాబులకు జరిమానా

**– ట్రాఫిక్ సిఐ జగదీష్ బాబు వెల్లడి**

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 27**

వాహనాల తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ వారు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 35 మంది పట్టుబడినట్లు ఒంగోలు ట్రాఫిక్ సిఐఎస్ జగదీష్ బాబు వెల్లడించారు. వీరిని న్యాయస్థానం ముందు హాజరు పరచగా ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున న్యాయమూర్తి జరిమాన విధించినట్లు సిఐ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు, ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

# మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ రహంతుల్లా



**పొన్నలూరు పెన్ పవర్ డిసెంబరు 27**

మండలంలోని భోగనంపాడు గ్రామానికి చెందిన షేక్ రహంతుల్లాకు శనివారం మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడగా నియమితులయ్యారు. రహంతుల్లా మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, మారి టైం బోర్డు చైర్మన్ సత్య నాకు ఈ పదవిని ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నా వంతుగా నిత్యం కృషి చేస్తానని తెలిపారు. రాహంతుల్లాకు మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైనందుకు మండల టిడిపి నాయకుడు అనుమోలు సాంబశివరావు, మండల నాయకులు మండవ మురళీమోహన్, కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చిల్లకర్ర ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

**పొన్నలూరు పెన్ పవర్ డిసెంబర్ 27**

మండలంలోని చెరుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలో గల 787 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న చిల్ల కర్ర ట్రాక్టర్లలో తహసీల్దార్ వి పుల్లారావు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పుల్లారావు తనిఖీ చేసి ఆక్రమంగా తరలిస్తున్న చిల్ల కర్ర ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.



# కూటమి పాలనలో, ఎమ్మెల్యే ముత్తుముల సారధ్యంలో ఎస్సి సోదరులకు, మహిళలకు సముచిత స్థానం

**పార్లమెంట్ కమిటీలో నియమితులైన "గుర్రం దానియేలు"ను సన్మానించిన టీడీపీ నాయకులు.**

**పార్లమెంట్ కమిటీలో నియమితులైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు..**

**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 27**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన ఎస్సి నాయకులు "గుర్రం దానియేలు" ను పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి ఆధ్వర్యంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు శానేశావలి మాట్లాడుతూ కూటమి పాలనలో గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గంలోని ఎస్సి సోదరులకు, మహిళలకు సముచిత స్థానం కల్పించారన్నారు. రాష్ట్రంలో ఎడ్యుకేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గా, పార్లమెంట్ కమిటీలో, మార్కెట్ యార్డ్ కమిటీలు, అనుబంధ విభాగాల్లో ఎస్సీలకు అవకాశం కల్పించిన ఘనత ఎమ్మెల్యే అశోక్ రెడ్డి దేనని, మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ ఒంగోలు పార్లమెంట్ కమిటీలో స్పోక్స్ పర్సన్ గా గిద్దలూరు పట్టణానికి చెందిన "మనం ఝాన్సీ శ్వేతా", కార్యదర్శిగా "వేములపాటి లక్ష్మిదేవి" లను నియమించటం ప్రజా పాలనకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా దానియేలు మాట్లాడుతూ తనను గుర్తించి పార్లమెంట్ కమిటీలో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య,



పట్టణ ఉపాధ్యక్షులు పందీటి రజిని బాబు, పట్టణ కౌన్సిలర్లు లోక్కు రమేష్, బిల్లా రమేష్, బూనబోయిన చంద్రశేఖర్, బిల్లా రమేష్, ఎస్సి నాయకులు యామా సంజయ్, ఇజ్రాయేలు, లక్ష్మయ్య, మరియు పట్టణ టీడీపీ నాయకులు ఉలాపు బాల చెన్నయ్య, మండ్ల శ్రీను, పసుపులేటి శ్రీనివాసులు, ఎలిశెట్టి వెంకటప్ప, బోయిలపల్లి కిషోర్, షేక్ అహ్మద్ బాషా, బద్రి బాషా, జిల్లెల్ల సంపత్ రెడ్డి, పిడతల రవితేజ, గిద్దలూరు మద్దిలేటి, దూదేకుల దస్తగిరి, బొర్రా రాఘవేంద్ర, కావడి గురువయ్య, అశోక్ నాయక్, శంకర్, రంగనాయకులు, తదితరులు పాల్గోన్నారు.

# కొనసాగుతున్న అక్రమ లేఅవుట్లు తొలగింపు

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు డిసెంబర్ 27**

ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా అనధికార లేఅవుట్లను తొలగించుటలో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ సచివాలయ పరిధిలోని ముక్తినూతలపాడు గ్రామ సర్వే నెం. 220,209 లలో అనుమతులు లేని అక్రమ లేఓట్లు లను పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులు.

**అసిస్టెంట్ సిటీ ప్లానర్..:** జేడ్. సుధాకర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె.బాబు రావు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ షేక్. రసూల్, పట్టణ ప్రణాళిక సిబ్బంది శనివారం పలు అక్రమ లేఅవుట్లు తొలగించారు. వెంకటేశ్వర కాలని అనుమతులు లేని అక్రమ లేఅవుట్లు లోని హద్దు రాళ్ళను జె.సి.బి సహాయంతో తొలగించారు. నగరపాలక సంస్థ పరిధి లోని అనధికార లేఓట్లను ఏర్పాటు చేసిన యజమానులు వారి ప్లాట్లను, అనధికారిక లేఓట్లను ఎల్ఆర్ఎస్ స్కీము క్రింద క్రమబద్ధీకరించు కొన వలసినదిగా తెలియజేశారు. అలా రెగ్యులరైజేషన్ చేయించుకొనటువంటి అనధికార లేఓట్ ప్లాట్లు తొలగించడం జరుగుతుందని తెలియజేశారు.



# ఇన్చార్జి ఎరీక్షన్ బాబు మాకు వద్దని నిరసన ర్యాలీ

## పరిశీలకులు కాటసాని రాంభూపాల్ రెడ్డికు ఎరీక్షన్ బాబు పని తీరుపై ఫిర్యాదులు

## నియోజకవర్గం నుండి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ డిసెంబర్ 27**

టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు పనితీరు వల్ల తెలుగుదేశం పార్టీ కి చెడ్డపేరు వస్తుందని, పార్టీ కోసం కష్టపడ్డ వారికీ గుర్తింపు లేదని, ఇంచార్జి ఎరీక్షన్ బాబు మాకు వద్దని శనివారం డాక్టర్ మన్నే రవీంద్ర వర్గం నిరసన, ర్యాలీ నిర్వహించారు.నియోజకవర్గం టీడీపీ లో రెండు గ్రూపుల మధ్య తారస్థాయికి చేరిన వర్గ రాజకీయ పరిణామాలను ఆరా తీయడానికి పరిశీలకులు కాటసాని రాంభూపాల్ రెడ్డి వస్తున్నారని తెలిసి నియోజకవర్గం నుండి నాయకులు, కార్యకర్తలు మన్నే రవీంద్ర ఇంటివద్దకు చేరుకున్నారు. చాలా సేపు వరకు పరిశీలకులు రాకపోవడంతో, డాక్టర్ నివాసం నుండి ఇంచార్జి మాకువద్దు, ఎరీక్షన్ బాబు డౌన్ డౌన్, తెలుగుదేశం పార్టీని బ్రతికించండి అంటు నినాదాలు చేస్తూ ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాపరిషత్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ మన్నే రవీంద్ర మాట్లాడుతూ ఇంచార్జి ఎరీక్షన్ బాబు అవినీతి వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందని, దశాబ్దాలుగా పార్టీ వెన్నంటి ఉన్నామని కానీ గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ఇన్చార్జి ఎరిక్షన్ బాబు వలన తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని అధిష్టానం దృష్టికి ఇక్కడి పరిస్థితి వివరిస్తామన్నారు. అనంతరం పరిశీలకులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మన్నే రవీంద్ర నివాసానికి చేరుకోవడంతో ఎరీక్షన్ బాబు పనితీరుపై పిర్యాదు లు చేసి జరుగుతున్న పరిస్థితులు వివరించారు. అధికారపార్టీలో తాము ఉన్నట్లుగా తమకు లేదని,ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి నాయకులకు, కార్యకర్తలకు పనులు జరుగుతున్నాయని ఆయన వద్ద వివరించారు. గడిచిన ఐదేళ్లుగా గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు పడ్డామని కానీ ఇన్చార్జి మాత్రం వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు దగ్గరికి తీసుకుని మరి వారికే మద్దతు తెలియజేయడం దారుణంగా ఉందన్నారు. ఐదు మండలాలలో పార్టీ పుట్టుక నాటి నుండి ఉన్న ఏ ఒక్కరికి న్యాయం





జరగడం లేదని, గట్టిగా ప్రశ్నిస్తే మీరు మరో వర్గం అంటూ తమను దూరం పెట్టి సుమారు రెండు సంవత్సరాలు గడిచాయన్నారు. సంవత్సరాల నుండి పార్టీలో ఉన్న వారు ఎవరు ఇతరులు ఎవరు అనే తేల్చుకోలేని స్థితిలో ఇన్చార్జి ఉన్నారని ప్రస్తుతం తాము మాత్రం పరాయి వర్గంగా మారామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో డాక్టర్ మన్నే రవీంద్ర పేరు తెలియని వారు ఎవరూ లేరని ఎన్నికల సమయంలో గుర్తుకు వచ్చిన ఆయన ప్రస్తుతం ఎందుకు గుర్తుకు రాలేదని వారు అన్నారు. , నియోజకవర్గంలో కొందరు రైతులు తోలుకుంటున్న మట్టిపై సైతం నగదును వసులు చేస్తున్నారని, రాష్ట్ర పరిశీలకుల వద్ద వివరించారు. గత ఎన్నికలలో తాము సైతం బాధ్యతలు నిర్వహించామని తమకు పార్టీ మాత్రమే ముఖ్యమని, ఎవరైనా పార్టీని భ్రష్టు పట్టిస్తే ఊరుకునే ప్రసక్తి లేదంటూ వారు అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న స్థితిగతులపై తాము తెలియజేస్తున్నామని ఇదే పరిస్థితి కనుక నియోజకవర్గంలో కొనసాగితే రానున్న స్థానిక సంస్థలు ఎన్నికలలో పార్టీ పూర్తిస్థాయిలో అభాసు పాలవడం ఖాయం అన్నారు. ఎక్కడా లేనివిధంగా ఫ్లెక్సీలను తొలగించవలసిన పరిస్థితి ఇన్చార్జికి ఎందుకు వచ్చిందంటూ వారు ప్రశ్నించారు. ఫ్లెక్సీ ల వలన గుర్తింపు ఉండదని ప్రజలలో గుర్తింపు పొందిన వారిని మాత్రమే నాయకుడు అంటారని అటువంటి పరిస్థితి డాక్టర్ మన్నే రవీంద్రకు ఉందని, పట్టణంలో ఆయన ఫ్లెక్సీలు ఉన్నాయంటూ తొలగించాలని అధికారులను ఆదేశించడం ఏమిటని తెలిపారు.అధిష్టానం పునరాలోచించి నియోజకవర్గం పై తగిన చర్యలు చేపట్టాలని వారు వినతులు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి ఆంజనేయులు,మాజీ త్రిసభ్య కమిటీ సభ్యులు అంబటి వీరారెడ్డి,మాజీ మండలపార్టీ అధ్యక్షులు షేక్ జిలాని,వడ్లమూడి లింగయ్య, వెన్న వెంకటరెడ్డి,సీతయ్య,పోతిరెడ్డి రమణారెడ్డి మైనార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్,కరీముల్లా ,లతోపాటు ఐదు మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లా కార్యాలయాలకు స్థలాల పరిశీలన





**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ డిసెంబర్ 28**

పట్టణ, మండల పరిధిలో జిల్లా ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలు స్థలాలను అధికారులు పరిశీలించారు.జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, ఇంచార్జ్ ఆర్డీవో శివరామిరెడ్డి ,తాసిల్దార్ చిరంజీవి , మార్కాపురం సి.ఐ సుబ్బారావు లతో కలసి ప్రభుత్వ భవనాలను ప్రభుత్వ కార్యాలయాలను ఎమ్మెల్యే పరిశీలించారు.జిల్లా ఏర్పాటు వల్ల జిల్లా కార్యాలయాల ఏర్పాటు కోసం ప్రభుత్వ భవనాలను, ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తూ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయండి



**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 27**

సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని శనివారం గిద్దలూరు పట్టణంలోని పలు కార్మిక అడ్డాల దగ్గర జీవు జాతాతో ప్రచారం నిర్వహించారు. ఈ జాతాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ పాల్గొని మాట్లాడుతూ కార్మికులు హక్కుల సాధనకు కార్మిక వర్గం ఐక్యం కావాలని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కొర్డ్సుగా అమలు చేయడాన్ని వ్యతిరేకించాలని అన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి జనవరి 4 వరకు జరుగు సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. జనవరి 4వ తేదీ విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభ ర్యాలీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు . ఈ ప్రచార కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి టి ఆవులయ్య, ఆర్ మాలకొండయ్య మండల కన్వీనర్ బి నర్సింహులు, సిఐటియు నాయకులు జి ఆనంద్ రావు, మురళి, పి రవి, తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలి

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ డిసెంబర్ 27**

బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను క్షేత్రస్థాయిలో అవగాహన కలగజేయడం ద్వారా మాత్రమే నిర్మూలించగలమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. శనివారం నగరంలోని బొమ్మరిల్లు స్వచ్ఛంద సేవా సంస్థ లో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారు సూచనల మేరకు నిర్వహిస్తున్న 100 రోజుల కార్యక్రమములో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల న్యాయ సేవాధికారి కమిటీలు , జిల్లా న్యాయ సేవ అధిక సంస్థ ద్వారా అవగాహన కలుగజేస్తున్నామని మరీ ముఖ్యంగా బాల్య వివాహాలు ప్రకాశం జిల్లాలోని ఎక్కువగా జరగటం ఎంతో విచారించదగిన పరిణామం అన్నారు. వీటిని నిర్మూలించడానికి ప్రభుత్వ రంగంలోని అన్ని సంస్థలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని అన్నారు. బాల్యవివాహాలు చేసిన తల్లిదండ్రులు, మత పెద్దలు, వివాహానికి సహకరించిన బంధువులు ప్రతి ఒక్కరు శిక్షార్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మరిల్లు సంస్థ నిర్వాహకులు ఖాసిం పాల్గొన్నారు.

### 3 రాష్ట్రాల స్థాయి టెన్నిస్ పోటీలలో

# గిద్దలూరు టెన్నిస్ క్రీడాకారుల ముందంజ

**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 27**

హిందూపూర్‌లో జరుగుచున్న ఆంధ్ర, తెలంగాణ - కర్ణాటక రాష్ట్ర స్థాయి 55+ మెన్ డబుల్స్ లో రాము నరసరావుపేట - సుధా హైదరాబాద్ (హిందూపూర్) పై టపా వలి గిద్దలూరు - రమేష్ మార్కాపురం వారు 2-7 స్కోర్ తో విజయం సాదించి ప్రీ క్వార్టర్ ఫైనల్ లోకి ప్రవేశించారు అలాగే 65+ మెన్ డబుల్స్ లో రసూల్ నరసరావుపేట - దేవా హిందూపూర్ పై కోటయ్య గౌడ్ గిద్దలూరు - ఐసయ్య పులివెందుల వారు 1-7స్కోర్ తో విజయం సాదించి ప్రీ క్వార్టర్ ఫైనల్ లోకి ప్రవేశించారు హిందూపూర్ టెన్నిస్ టోర్నమెంట్ లో విజయం సాధించిన గిద్దలూరు క్రీడాకారులైన టపా వలి , కోటయ్య గౌడ్ లను ప్రకాశం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులైన డాక్టర్ జి కే మోహన్ రెడ్డి గిద్దలూరు లాన్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ షేక్ భాషా ,ట్రెజరర్ రంగయ్య స్థానిక టెన్నిస్ క్రీడాకారులు డాక్టర్ సందీప్ ,మహేష్ , మురళి డాక్టర్ సతీష్ రామచంద్ర రెడ్డి డాక్టర్ శ్రీనివాసులు,రిటైర్డ్ మేనేజర్ గంజి రాఘవులు , గంజి శేఖర్ నారాయణ ,శివప్రసాద్ , అబ్దుల్లా - మనోజ్ లుఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.



# డిసెంబర్, 31 తేదీనే యన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు పంపిణీ - డిఆర్డీఏ పి.డి నారాయణ

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 27**

యన్.టి.ఆర్. భరోసా పెన్షన్ పంపిణీ కి సంబంధించి, జనవరి 1వ తేదిన నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా ఒకరోజు ముందుగానే అనగా 31 డిసెంబర్ 2025 నే ఇంటింటికి వెళ్ళి పెన్షన్ పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వము నిర్ణయించిందని డిఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. నారాయణ తెలియజేశారు. జిల్లాలో 2,82,576 మంది పెన్షన్ లబ్దిదారులకు రూ.125. కోట్ల 02 లక్షల 05 వేల ఐదు వందల



రూపాయలు విడుదల చేయబడినవి. యన్.టి.ఆర్. భరోసా పెన్షన్ పధకము క్రింద గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తో పాటు ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది ద్వారా ఇంటింటికి పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఈనెల 31 న ఉదయము 06.30 గంటలకు గ్రామ / వార్డ్ సచివాలయ పరిధిలోని అన్ని గ్రామాలలో పెన్షన్ లబ్దిదారులకు పెన్షన్ నగదు వారి ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఎవరైనా 31.12.2025 న అందుబాటులో లేకపోతే 02 జనవరి 2026 శుక్రవారం పంపిణీ చేస్తారని తెలిపారు.

# పంటను ఈ క్రాప్ చేసుకోవాలి

### జిల్లా వ్యవసాయ అధికారి



**పొన్నలూరు పెన్ పవర్ డిసెంబర్ 27**

మండల కేంద్రమైన పొన్నలూరులో రబీ 2025 లో సాగుచేసిన పంటలకు డిజిటల్ క్రాఫ్ట్ సర్వే ద్వారా చేసే ఈ పంట నమోదును ప్రకాశం జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సర్వే నెంబర్ వద్దకు వెళ్లి ఈ పంట నమోదు చేయవలసిందిగా తెలిపారు. రబీ సీజన్లో వేసిన ప్రతి పంటను పంట నమోదు చేయాలని సూచించారు. రైతులకు అన్ని గ్రామాలలో రైతు సేవా కేంద్రాలు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని ఎమ్మార్పీ రేట్లకే అమ్మాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వి రాము, ఉద్యాన శాఖ అధికారి విష్ణుప్రియ, సుధీర్ గ్రామ వ్యవసాయ సహాయకులు టీవీ నారాయణ ,మందాకిని రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పరిమితికి మించి లోడు వేస్తే

# వాహనం సీజ్

### - ఉప రవాణా కమిషనర్ సుశీల





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ డిసెంబర్ 27**

పరిమితికి మించి అధిక లోడుతో వాహనాలు నడిపితే ఆ వాహనంపై కేసు రాయడంతో పాటు సీజ్ చేయటం జరుగుతుందని ఉపరవాణా కమిషనర్ ఆర్ సుశీల వాహన యజమానులను హెచ్చరించారు. శనివారం ఉప రవాణా కమిషనర్ కార్యాలయం నందు గనుల శాఖ, రవాణా శాఖ సంయుక్తంగా లారీ యజమానులు తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రానైట్ రాయి, కంకర రాళ్ళను లోడ్ చేసుకుని వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా టార్పాలిన్ వేయాలన్నారు. అధిక లోడుతో వాహనాలు ప్రయాణం చేయడంతో రహదారులు దెబ్బతింటున్నాయని తద్వారా ఆ ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. వాహనదారులు నిబంధనలు అతిక్రమించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ రవాణా శాఖ అధికారులు రామచంద్రరావు, సురేంద్ర ప్రసాద్, కిరణ్ ప్రభాకర్, జగదీష్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వామిత్ర సర్వే పై శిక్షణ కార్యక్రమం

**పొన్నలూరు పెన్ పవర్ డిసెంబర్ 27**

మండల పరిషత్ కార్యాలయం నందు శనివారం నాడు స్వామిత్ర సర్వే పై శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ పి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ స్వామిత్వ సర్వే ని సర్వే బృందాలు సమన్వయము తో చెయ్యాలని పలు సూచనలు సలహాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండలం సర్వేయర్ గోపి రెడ్డి డిప్యూటీ ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం రవిబాబు , భారతి మండలం లోని అందరు పంచాయితీ అభివృద్ధి అధికారులు,గ్రామ రెవెన్యూ అధికారులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు విలెజ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



# కూటమి హయాంలో ఆత్రేయపురం మండలానికి సమగ్ర అభివృద్ధి

**తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలం: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 27:**ఆత్రేయపురం మండలం కూటమి ప్రభుత్వ హయాంలో సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు స్పష్టం చేశారు. శనివారం ఆత్రేయపురంలో ముదునూరి వెంకటరాజు స్వగృహంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్రేయపురం మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బొబ్బర్లంక – వద్దపర్రు రహదారి పనులు త్వరలో పూర్తి కానున్నాయని పేర్కొన్నారు.
కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని టెంపుల్ టూరిజం లో భాగంగా అభివృద్ధి చేస్తున్నామని, తద్వారా ప్రాంతానికి మరింత ఖ్యాతి లభిస్తుందని తెలిపారు. వచ్చే నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలను రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచేలా ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డ్రాగన్ బోట్ రేసులు, ఈత పోటీలు, లొల్లలాకుల వద్ద ఫుడ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా
నిలవనున్నాయన్నారు. లొల్లలాకుల పునర్నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పాస్టర్లకు నెలకు రూ.5 వేల చొప్పున ఒకేసారి రూ.60 వేల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు.డ్వాక్రా మహిళలు, యువత స్వయం ఉపాధి సాధించేందుకు ఎంఎస్ఎంఈ సదస్సులు నిర్వహించామని, సబ్సిడీ రుణాలపై అవగాహన కల్పించేందుకు రావులపాలెంలో కార్యాలయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 'సూపర్ పాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో కష్టపడి పనిచేసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ప్రశంస పత్రాలు అందజేశామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ ఐక్యమత్యంతో కలిసి పనిచేసి కూటమి సత్తా చాటాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ పదవులు, దేవాలయాల పాలక మండలి పదవులు పొందిన వారిని సత్కరించారు.ఈ సమావేశంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాథం, ముళ్లపూడి భాస్కరరావు,మారి శెట్టి వెంకటేశులు, మద్దూరి సుబ్బారావు, నాగిరెడ్డి సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన బండారు



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 27:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధల మధ్య శ్రీ స్వామి వారి 2026 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కొత్తపేట
శాసనసభ్యులు బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం కోనసీమ ప్రజల ఆరాధ్య దైవక్షేత్రమని పేర్కొన్నారు. స్వామి వారి కృపతో ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
భక్తులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ పాలకమండలి చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలకమండలి పనిచేస్తోందన్నారు. 2026 సంవత్సర క్యాలెండర్ ద్వారా స్వామి వారి ఉత్సవాలు, పూజా కార్యక్రమాల పూర్తి వివరాలు భక్తులకు సులభంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు.ఆలయ నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, ఆలయ అధికారులు, అర్చకులు, పాలకమండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.

## దాతలకు సన్మానం



**కాట్రేనికోన పెన్ పవర్ డిసెంబర్ 27**
కాట్రేనికోన మండలం, కుండలేశ్వరం గ్రామంలోని శ్రీ కుండలేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు సహకరించిన దాతలకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో, ప్రభుత్వ విప్ ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి గురించి మాట్లాడుతూ, రాబోయే పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అవసరమైన గ్రాంట్లు, సహాయ సహకారాలు అందిస్తున్నట్టు తెలిపారు. అన్నదానానికి సహకరించిన దాతల సేవాభావాన్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తదేపా నాయకులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, పిఎస్ఎన్ రాజు, స్టేట్ ఆక్వా బోర్డు డైరెక్టర్ విత్తనాల బుజ్జి, రవి వర్మ, తదితరులు పాల్గొన్నారు.

## చెయ్యేరులో దివ్యాంగుల దినోత్సవం సంబరాలు



**కాట్రేనికోన పెన్ పవర్ డిసెంబర్ 27:**దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాట్రేనికోన మండలం చెయ్యేరు జెడ్పీ హై స్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు ఎంపీ హరీష్ మాధుర్ ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా భవితా స్కూల్‌లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల అవసరాలను గుర్తించి, పెద్దల ఆర్థిక సహకారంతో భవితా స్కూల్‌కు అవసరమైన ఉపకరణాలు, పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు.
దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ నిలుస్తుందని, వారి సంక్షేమం, విద్యా అభివృద్ధికి అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా దాట్ల సుబ్బరాజు తెలిపారు.
ఈ కార్యక్రమంలో కూటమి సీనియర్ నేతలు సర్పంచ్ చెల్లి సురేష్, నడిపల్లి సుబ్బరాజు,టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, పి ఎస్ ఎన్ రాజు, దాట్ల పవన్, నాగభూషణం,రవి వర్మ, వంగ దుర్గ బాబు,కార్యకర్తలు అభిమానులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**పెన్ పవర్ డిసెంబర్ 27**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలోఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బీసీ చైతన్య వేదిక ను శనివారం సభ ప్రాంగణమును పరిశీలిస్తున్న బీసీ నాయకులు ఈతకోట సెంటర్‌లో, జమీందార్ కాంప్లెక్స్ ఎదురుగా, నేషనల్ హైవే పక్కన జరగనున్న బీసీ భారీ బహిరంగ సభకు సర్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ అధ్యక్షులు వీరవెల్లి శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన సమీక్షలో సభ నిర్వహణ, సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను విశ్లేషించారు. రామచంద్రాపురం నియోజకవర్గానికి చెందిన బీసీ శెట్టి బలిజ సామాజిక వర్గ యువ నాయకుడు రెడ్డి సురేష్‌ను కోనసీమ జిల్లా బీసీ చైతన్య వేదిక యువ నాయకుడిగా నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు. బీసీ చైతన్య వేదిక నాయకులు, కార్యకర్తలు సభ విజయవంతం కావడానికి అన్ని ఏర్పాట్లను సజాగ్రతగా చూస్తున్నారని తెలిపారు.

## కాకినాడ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం 'రెవెన్యూ క్లినిక్'

**డిసెంబర్ 29 నుంచి పీజీ ఆర్ ఎస్ లో ప్రత్యేక నిర్వహణ**

**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 27:**ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా, రెవెన్యూకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ఇకనుంచి 'రెవెన్యూ క్లినిక్' ను ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు తెలిపారు.ఈ రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం డిసెంబర్ 29, నుంచి ప్రతి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్‌లో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), తహసీల్దారులు పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సంబంధిత అర్జీలను పరిశీలించి పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు.
కావున రెవెన్యూకు సంబంధించిన సమస్యలు కలిగిన అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు కలెక్టర్ తరపున జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు ప్రకటన విడుదల చేశారు.

## రేఖపల్లి జంక్షన్,వద్దవాహనాలు తనిఖీ


**–ఎస్.ఐ.సంతోష్,కుమార్,పోలీసు సిబ్బంది.**

**వి.ఆర్.పురం పెన్.పవర్.డిసెంబర్.28**
మండలంలోని రేఖపల్లి,వి.ఆర్.పురం జంక్షన్, వద్దశనివారం వి.ఆర్.పురం ఎస్.ఐ.సంతోష్, కుమార్,పోలీసు సిబ్బంది.వాహనాలు తనిఖీ చేశారు.ఈసందర్భంగా వి.ఆర్.పురం ఎస్.ఐ. సంతోష్,కుమార్,మాట్లాడుతూ మండలంలోని వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్,లు కలిగి ఉండాలని,వాహనాలలోప్రయాణికులను పరిమి తికిమించిఎక్కించరాదని,ప్రధానరహదారులపైన వాహనాలనునడిపేటప్పుడు వాహనదారులు తగు జాగ్రత్తలుతీసుకోవాలని,వాహనదారులకుచూసిం చారు. ఈకార్యక్రమంలోఎస్.ఐ.సంతోష్,కుమార్,




పోలీసుసిబ్బంది.వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## జనార్ధనస్వామి దర్శించుకున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ దంపతులు.




**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 27;**నవజనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి వారిని ధనుర్మాసం శనివారం సందర్భంగా ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్సీ) సూపరిండెంట్ డాక్టర్ శివశంకర్, డాక్టర్ అనూష దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు సాదర స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు డా.శివశంకర్ దంపతులను సత్కరించారు. పురాతన ఆలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని వారు తెలిపారు.

## డాక్టర్ ప్రవీణకు రాష్ట్రీయ అశోక సమ్మాన్



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు డిసెంబర్ 27**
జీవితకాల విద్యాసాధన రంగంలో డాక్టర్ మూరల ప్రవీణ సాధించిన అసాధారణ విజయాలకు గుర్తింపుగా మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు రాష్ట్రీయ అశోక సమ్మాన్ అవార్డు ను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ప్రవీణ మూరల గతంలో ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ లో క్రియాశీలక సభ్యురాలుగా అనేక విశిష్ట సేవలు అందించారు. ప్రపంచవ్యాప్తంగా సామాజిక సేవలు అభివృద్ధికి ప్రవీణ చూపుతున్న నిబద్ధత కు గుర్తింపుగా రాష్ట్రీయ అశోక సమ్మాన్ పురస్కారం దక్కిందని పలువురు కొనియాడారు.

## పొదిలిలో జబ్బార్ మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కందుల



**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 27**
పొదిలిలో శనివారం నాడు మృతి చెందిన షేక్ జబ్బర్ అనే తెలుగుదేశం కార్యకర్త మృతదేహాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సందర్శించారు. అలాగే జబ్బార్ మరణం ఎంతో బాధాకరమన్నారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి వెంట పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, పట్టణ తెలుగుదేశం అధ్యక్షు లు ముల్లా కుద్దూస్, షేక్ అల్లా బకాష్, షేక్ రఫీ తోపాటు పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## మర్రిపూడి మండలంలో రోడ్డు ప్రమాదం వ్యక్తి దుర్మరణం



**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 27**
మరిపూడి మండలం లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందారు. మండలంలోని తంగేళ్ల గ్రామం వద్ద శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పొగనారుతో వెళ్తున్న ఒక ట్రాక్టర్ ను వెనుక నుండి మోటార్ సైకిల్ పై వస్తున్న ఇరువురు వ్యక్తులు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ పై ప్రయాణిస్తున్న డేవిడ్ అనే వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో అతనికి వైద్య చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు. ఈ సంఘటనపై మరిపూడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# ఏలూరులో వంగవీటి మోహన రంగాకు ఘన నివాళి



**ఏలూరు డిసెంబర్ 27 పెన్ పవర్:** పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరుపేదల పెన్నిధి స్వర్గీయ వంగవీటి మోహన రంగా 37 వ వర్ధంతి వేడుకలను ఏలూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్ సి.ఆర్.రెడ్డి కాలేజీ వద్ద రంగా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు జనసేన ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు హాజరై రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఎన్ని తరాలైనా గాని రంగా ఆశయాలు ప్రజల్లో జీవించే ఉంటాయన్నారు. ఇప్పుడున్న ఈ కొత్త జనరేషన్ రంగా ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాలని మొగల్రాజపురంలో పేద ప్రజల ఇళ్ల పట్టాల విషయమై వెళ్తున్న రంగాను పోలీసులు అరెస్టు చేయడంతో నిరాహార దీక్ష చేశారని ఆ నిరాహార దీక్షలోనే ఆగంతకుల చేతిలో రంగ హత్య చేయబడ్డారని అన్నారు. వంగవీటి రంగా స్ఫూర్తితో అనేకమంది రాజకీయాల్లో ఉన్నారని వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ వంగవీటి రంగా పేదల కోసం చేసిన సేవలు ప్రజల హృదయాల్లో ఆయన సంపాదించుకున్న స్థానం చిరస్మరణీయమని అన్నారు. అన్ని కులాలను సమానంగా సమాంతరంగా చూసే మానవతావాది పేదల హక్కుల కోసం పోరాడుతూ ఆ పోరు బాటలో ప్రాణాలు అర్పించిన మహోన్నత మహా నాయకుడు అని కొనియాడారు.రంగా బాటలోనే మా అధినాయకుడు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ నడుస్తున్నారని అన్నారు. ఆయన తీసుకున్న ప్రతి శాఖకు నూటికి నూరు శాతం న్యాయం చేస్తున్నారని, అంతా మంచి నాయకుడి అడుగు జాడల్లో తాను నడుస్తున్నందుకు అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.అనంతరం 200 మంది వృద్ధులకు చీరలు, బిస్కెట్లు ,ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు నాయకులు, కాపు బలిజ సంక్షేమ సేన నాయకులు రంగా అభిమానులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గూడెచెదరిన నిరుపేదకు ఓం ఫౌండేషన్ సహాయం.



**రౌతులపూడి పెన్ పవర్ డిసెంబర్ 27.** స్థానిక రౌతులపూడి గ్రామం సినిమా సెంటర్ సమీపాన నిరుపేద కుటుంబానికీ చెందిన జోళ్ళు కుట్టుకునే షాపు శుక్రవారం అగ్నికి ఆహుతై సర్వం బూడిదైనది. కట్టుబట్టలతో రోడ్డున పడిన మోర్త వాణీ కుటుంబం ఓం ఫౌండేషన్ ఇండియా వారిని సహాయం కోరడం జరిగినది, ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు, కూరగాయలు, దుప్పట్లు,చాపలు, ఇవ్వడం జరిగింది,గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ఏ నిరుపేద కుటుంబానికి ఏ ఆపద వచ్చినా ఓం ఫౌండేషన్ వెంటనే స్పందించి వారిని ఆదుకుని, ధైర్యం చెప్పడం జరుగుతుంది, ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సామాజిక సేవకులు సుర్ల శ్రీనివాసు, కొరుప్రోలు రమేష్, పోలుపర్తి శ్రీను, అంకంరెడ్డి రాము, కొరుప్రోలు చంటి, పంచాద సూరిబాబు, రిక్షా సత్తిబాబు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం లో ఘనంగా జరుగుతున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవం.



**ఏలూరు డిసెంబర్ 27 పెన్ పవర్:** స్థానిక ఆర్ ఆర్.పేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఆరోగ్యాన్ని ప్రసాదించే శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరిపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీమతి పాలడుగు వెంకట రమాదేవి గారు, ధర్మకర్తలు ఈతకోట శ్రీనివాస్ రావు, నంగులూరి సత్యనారాయణ, బొత్స మధు, గోకా నెహ్రూ బాబు, కందుకూరి వెంకట సీతారామాంజనేయ శర్మ, సువ్వాడ పద్మావతి, చౌటుపల్లి తులసి, డొక్కు రమాదేవి, గుమ్మడి లక్ష్మీ గణేశ్వరీ, రంభా అనసూయ, ఎక్స్ అఫిషియో సభ్యులు శ్రీమాన్ కిళాంబి మారుతి శ్రీనివాస్ రామానుజాచార్యులు జనసేన నాయకులు వినోద్, మరియు భారీ సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో సముద్ర జీవ వైవిధ్యంపై అవగాహన సదస్సు



**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 27:**ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల మత్స్య మరియు ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో "సముద్ర జీవ వైవిధ్యం మరియు సముద్ర జల నాణ్యత - సముద్ర జీవులపై ప్రభావం" అనే అంశంపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ విషయాన్ని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం సముద్ర రసాయన శాస్త్ర విభాగానికి చెందిన ప్రఖ్యాత ప్రొఫెసర్ డా. నిట్టాల ఎస్. శర్మ ముఖ్య ఉపన్యాసకుడిగా పాల్గొని సముద్ర జీవ వైవిధ్యం, సముద్ర జల నాణ్యత మార్పులు సముద్ర జీవులపై చూపే ప్రభావాలపై విస్తృతంగా వివరించారు.నీటి ఉష్ణోగ్రత,లవణీయత, ద్రవీభవించిన ఆక్సిజన్ వంటి అంశాలు సముద్ర జీవుల ఆరోగ్యం మరియు ఆక్వాకల్చర్ రంగంపై కీలక ప్రభావం చూపుతున్నాయని ఆయన తెలిపారు. విద్యార్థులు పరిశోధన దిశగా ముందుకు సాగాలని,క్షేత్రస్థాయి అధ్యయనాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని మత్స్య మరియు ఆక్వాకల్చర్ విభాగాధిపతి డా. కె. ఎన్. మూర్తి పర్యవేక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఫిషరీస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంకటనగరంలో నిరుపేదలకు చీరలు పంపిణీ చేసిన మురళీకృష్ణంరాజు.



**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 27:**ప్రత్తిపాడు మండలం వెంకటనగరం గ్రామంలో క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ సిపి నాయకులు, నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు 50 మంది నిరుపేదలకు చీరలు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ గ్రామ అధ్యక్షుడు ఏనుగు మార్నిబాబు,వైస్సార్సీపీ నాయకులు వెలుగుల రాజుబాబు,ముప్పిడి నూకరాజు,బైపా దొంగబ్బాయి,ముప్పిడి సత్యనారాయణ, మరిపిరెడ్డి శ్రీను,కోలా తాతబాబు,బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు,యాళ్ల ఏసు,పలువురు వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నగరంలో ప్రజా రంజక పాలన కాదు

- ప్రజా హింస పాలన సాగుతోంది
- మీడియా సమావేశం లో జిల్లా వై యస్ ఆర్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి మార్తి లక్ష్మీ విమర్శ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 27**

నగరంలో విచ్చలవిడిగా లిక్కర్ , ఇసుక , జూదం మాఫియాలు, దందాలు, సెటిల్మెంట్లు, మానభంగాలు, హత్యలు, కిడ్నాప్ లు ప్రజాహింస పాలన సాగుతుందని జిల్లా వై యస్ ఆర్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి మార్తి లక్ష్మీ ధ్వజమెత్తారు. ప్రజల శ్రేయస్సు చూడాలని, మహిళల మాన ప్రాణాలను కాపాడాలని, గంజాయి, బ్లేడ్ బ్యాచులను నిర్మూలన చేయలని , నేరాలు తగ్గించినప్పుడే ప్రజారంజక పాలన అవుతుందన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆమె శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మైనర్ బాలిక మానభంగం, ప్రభుత్వ ఆసుపత్రి లో బాలింత ప్రాణాలు కోల్పోయి పసి బిడ్డ అనాధ అయ్యిందని, కనీసం మానవతా దృక్పథంతో టీడీపీ పార్టీ కనీసం పలకరించిన దాఖలాలు లేవని విమర్శించారు. నగరంలో నేటి అభివృద్ధి పనులను తమ పార్టీ భరత్ చేశారని, తమరు ప్రారంభోత్సవాలు చేశారని ఎద్దేవా చేసారు. మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణ ఘనత ఎప్పటికీ తమదేనని, శిలాఫలకాలు ధ్వంసం మీ సంస్కృతి ని , ప్రజల శ్రేయస్సు, నగర అభివృద్ధి తమ సంస్కృతిని అన్నారు. తమరు భరత్ ను విమర్శిస్తే ఒప్పని, అదే తాము ఆదిరెడ్డి వాసు ని విమర్శిస్తే తప్పని ఎలా అంటారని ప్రశ్నించారు. నగర మేయర్ గా, శాసనమండలి సభ్యుని గా, శాసన సభ్యురాలిగా, శాసన సభ్యుడు గా నగరంలో చేసిన అభివృద్ధి ని ఆదిరెడ్డి కుటుంబం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే అధికారిక ఫేస్ బుక్ అకౌంట్ లో ఒక మహిళ స్వంత వ్యక్తిగత విషయాలను పోస్టులు పెట్టడం బట్టి తెలుగుదేశం నాయకులకు మహిళల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థమవుతుందని విమర్శించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ప్రజలకు మంచి పాలనను అందిస్తే స్వాగతిస్తామని, లేదంటే ప్రజల ముందుకు తీసుకెళ్తానే వుంటామని ప్రతిపక్ష పార్టీ గా తమ ప్రాథమిక బాధ్యత అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి వట్టికుటి కృష్ణ వేణి, వాలంటీర్ విభాగం అధ్యక్షురాలు అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అండ్రంగిలో ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

**కాజులూరు, పెన్ పవర్, డిసెంబర్ 27:**భారతీయ జనతా పార్టీ కాజులూరు మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన కార్యక్రమంలో భాగంగా కాజులూరు మండలం అంద్రంగి గ్రామంలో మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు మాట్లాడుతూ,స్థానిక శాసన సభ్యులు,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.గత రెండు వారాల క్రితం రామచంద్రపురం నియోజకవర్గం సత్యవాడ గ్రామంలో వాసంశెట్టి సత్యం గారి చేతుల మీదుగా ఈ ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని గుర్తు చేశారు.జిల్లా మహిళా నాయకు రాలు తలాటం అమ్మాజీ కాజులూ రు మండల అధ్యక్షులు పుణ్యమంతుల



శివాజీ కృషితో అంద్రంగి గ్రామంలోని అర్హులైన మహిళలకు గ్యాస్ కనెక్షన్లు అందజేయడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డు కలిగి గ్యాస్ కనెక్షన్ లేని ప్రతి ఒక్కరూ ఈ ఉజ్వల యోజన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నగర వాసి డాక్టర్ శ్రీనివాస్ కు న్యూరాలజీలో బంగారు పతకం

**మానవతా సంస్థ అధ్యక్షుడు బూరగడ్డ మురళి అభినందనలు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 27:**నగర పరిసర ప్రాంతాల్లో సామాజిక సేవలు అందిస్తూన్న మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యుడు గేదెల వెంకటేశ్వరావు కుమారుడు డాక్టర్ జి. శ్రీనివాసు ఎం సి హెచ్ న్యూరాలజీ విభాగంలో ప్రథమ ర్యాంకు తోపాటు, బంగారు పతకం సాధించారు. ప్రస్తుతం డాక్టర్ శ్రీనివాస్ కేరళలోని కొచ్చి లోని ఏ ఐ ఐ ఎం ఎస్ (ఎయిమ్స్ ) లో న్యూరో సర్జన్ గా సేవలు అందిస్తున్నారు. డాక్టర్ శ్రీనివాసు ఆధునిక వైద్య రంగంలో ముఖ్యంగా మెదడు, వెన్నెముక , పుర్రె (స్కల్) శస్త్ర చికిత్స విభాగంలో వైద్య నిపుణుడిగా రాణిస్తున్నారు. డాక్టర్ శ్రీనివాసు న్యూరో సర్జరీ విభాగం నుంచి బంగారు పతకం సాధించటం చాలా ఆనందదాయకమని మానవతా సంస్థ అధ్యక్షుడు బూరగడ్డ మురళి అన్నారు. శ్రీనివాసు తండ్రి వెంకటేశ్వర్రావు సహృదయులు, దాన ధర్మలలో మేటని, ఎంతో మంది పేదలకు సేవలు అందిస్తూ మానవతా మూర్తి గా నిలుస్తున్నారు. ఆయన కుమారుడు డాక్టర్ శ్రీనివాసు కూడా తండ్రి బాటలో నడుస్తూ మానవతా మూర్తి లా ఎదగాలని, సమాజం కోసం తన వంతు సేవ చేయాలనీ, మరిన్ని విజయాలు సాధించాలని మానవతా సంస్థ తరుపున మురళి శుభాకాంక్షలు తెలిపారు.



## ఈనెల 29న జిల్లా ఖజానా కార్యాలయం లో పెన్షనర్ల కు అవగాహన



- వచ్చే జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు గడువు
- డిటివో ఎన్ సత్యనారాయణ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 27:**ఆంధ్రప్రదేశ్ ఖజానా శాఖ, సంచాలకులు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు 2026 జనవరి 1 వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వ తేదీ లోగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు (పెన్షన దారులు, కుటుంబ పెన్షన్ దారులు) తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలనీ తూర్పు గోదావరి జిల్లా ఖజానా అధికారి ఎన్. సత్యనారాయణ శనివారం విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు నిర్ణీత గడువులో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపుల్లో అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు పలు సౌకర్యవంతమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెన్షనర్లు జీవన్ ప్రామాణ్ అప్లికేషన్, జీవన్ ప్రామాణ్ ఫేస్ అప్లికేషన్ లను మొబైల్ ఫోన్ లో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. లేదా సమీపంలోని మీ సేవా కేంద్రం లేదా సంబంధిత ఉప ఖజానా కార్యాలయంలో ప్రత్యక్షంగా వచ్చి లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చునన్నారు.

బయోమెట్రిక్ (చేతి వేలిముద్రలు) సరిగా నమోదు కాకపోవడం, ఆరోగ్య సమస్యలు, మంచానికి పరిమితమైన పరిస్థితుల్లో ఉన్న పెన్షనర్లు తమ పరిస్థితిని సంబంధిత ఉప ఖజానా కార్యాలయానికి ముందుగా తెలియజేస్తే, ఖజానా సిబ్బంది స్వయంగా పెన్షనర్ వద్దకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్‌ను ధృవీకరిస్తారని జిల్లా ఖజానా అధికారి సత్యనారాయణ తెలిపారు. ఓ టి పి మొబైల్ ఫోన్ కు పంపడం జరుగుతుందని, మనుగడలో ఉండేలా చూసుకోవలసి ఉంటుందని తెలియ చేశారు. నిర్ణీత సమయంలో లైఫ్ సర్టిఫికేట్ సమర్పించేందుకు ఉన్న అవకాశాన్ని ప్రతి ప్రభుత్వ పెన్షనర్ సద్వినియోగం చేసుకొని,పెన్షన్ చెల్లింపుల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆయన కోరారు.

నవంబర్, డిసెంబర్ నెలలో ఇప్పటికే కొంతమంది పెన్షన్ దారులు లైఫ్ సర్టిఫికేట్ లు సమర్పించిన వారు కూడా జనవరి 1 వ తేదీ నుండి ఫిబ్రవరి 28 లోగా పై న పేర్కొన్న విధంగా మరొక సారి లైఫ్ సర్టిఫికేట్ ఆన్లైన్ ద్వారా గానీ ప్రత్యక్షంగా హాజరై సమర్పించాల్సి ఉందని స్పష్టం చేశారు.డిసెంబర్ 29 మధ్యాహ్నం 3 గంటలకి జిల్లా ఖజానా కార్యాలయం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెన్షన్ లు పొందుతున్న వారితో అవగాహన కల్పించడం కోసం సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందనీ డిటివో సత్యనారాయణ తెలియ చేశారు.

## అండ్రంగిలో ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

**కాజులూరు, పెన్ పవర్, డిసెంబర్ 27:**భారతీయ జనతా పార్టీ కాజులూరు మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన కార్యక్రమంలో భాగంగా కాజులూరు మండలం అంద్రంగి గ్రామంలో మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు మాట్లాడుతూ,స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత రెండు వారాల క్రితం రామచంద్రపురం నియోజకవర్గం సత్యవాడ గ్రామంలో వాసంశెట్టి సత్యం గారి చేతుల మీదుగా ఈ ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని గుర్తు చేశారు.జిల్లా మహిళా నాయకు రాలు తలాటం అమ్మాజీ కాజులూ రు మండల అధ్యక్షులు పుణ్యమంతుల శివాజీ కృషితో అంద్రంగి గ్రామంలోని అర్హులైన మహిళలకు గ్యాస్ కనెక్షన్లుఅందజేయడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డు కలిగి గ్యాస్ కనెక్షన్ లేని ప్రతి ఒక్కరూ ఈ ఉజ్వల యోజన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళలు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బిపి కంట్రోల్ అవ్వట్లేదా? వీటిని తినాల్సిందే!



ఉపవాస సమయాల్లో మనకు మొదట గుర్తుకు వచ్చే ఆహారం 'సగ్గుబియ్యం'. కేవలం సంప్రదాయ వంటకం మాత్రమే కాదు, సగ్గుబియ్యం అద్భుతమైన పోషక విలువల గని. మీకు తరచుగా అలసటగా అనిపిస్తోందా? జీర్ణ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా? అయితే మీ డైట్‌లో సగ్గుబియ్యాన్ని చేర్చుకోవాల్సిందే! కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉండే ఈ 'టపియోకా ముత్యాలు' తక్షణ శక్తిని ఇవ్వడమే కాకుండా, రక్తపోటును నియంత్రించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. సగ్గుబియ్యం తినడం వల్ల కలిగే 5 అద్భుత ప్రయోజనాలు మీకోసం. సగ్గుబియ్యం కేవలం ఉపవాస ఆహారం మాత్రమే కాదు, ఇది ఒక పోషకాల బాండాగారం. ఖిచ్డీ, వడలు, పాయసం వంటి వివిధ రూపాల్లో తీసుకునే సగ్గుబియ్యం శరీరానికి అనేక రకాలుగా మేలు చేస్తుంది. 1. తక్షణ శక్తికి మూలం: సగ్గుబియ్యంలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. మీరు నీరసంగా లేదా అలసటగా ఉన్నప్పుడు, పాలతో కలిపి సగ్గుబియ్యం తీసుకుంటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అందుకే ఉపవాసం ఉన్నవారు దీనిని ఎక్కువగా ఇష్టపడతారు. 2. బరువు పెరగాలనుకునే వారికి వరం: ఎంత తిన్నా బరువు పెరగని వారు సగ్గుబియ్యాన్ని తమ ఆహారంలో చేర్చుకోవాలి. ఇందులో ఉండే కేలరీలు మరియు కార్బ్స్ ఆరోగ్యకరమైన రీతిలో బరువు పెరగడానికి సహకరిస్తాయి. 3. మెరుగైన జీర్ణక్రియ: సగ్గుబియ్యం చాలా తేలికగా జీర్ణమవుతుంది. ఇది ప్రేగుల కదలికను సులభతరం చేస్తుంది. మలబద్ధకం మరియు గ్యాస్ సమస్యలతో బాధపడేవారు సగ్గుబియ్యం తీసుకోవడం వల్ల మంచి ఉపశమనం పొందుతారు.

ఇది ప్రేగుల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. 4. బలమైన ఎముకలు: సగ్గుబియ్యంలో కాల్షియం మరియు మెగ్నీషియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. క్రమం తప్పకుండా దీనిని తీసుకోవడం వల్ల ఆస్టియోపోరోసిస్ మరియు కీళ్ల నొప్పుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. 5. రక్తపోటు నియంత్రణ: నేటి కాలంలో హై బీపీ సర్వసాధారణం అయిపోయింది. సగ్గుబియ్యంలో ఉండే పొటాషియం రక్త ప్రసరణను మెరుగుపరిచి, రక్తపోటును నియంత్రణలో ఉంచడానికి సహాయపడుతుంది.




# ఖర్జూరాలు.. వంధ్యత్వానికి చెక్!

చలికాలంలో ఖర్జూరాలు రోగనిరోధక శక్తిని పెంచి, శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తాయి. నెయ్యిలో వేయించిన లేదా కాల్చిన ఖర్జూరాలతో అద్భుతమైన ఆరోగ్య లాభాలు ఉన్నాయి. రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని పాలతో తీసుకోవడం ఉత్తమం. వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల పురుషులు, మహిళలకు కలిగే ప్రయోజనాలు. చలికాలం వచ్చిందంటే చాలు.. వాతావరణంలో మార్పుల వల్ల మన రోగనిరోధక శక్తి తగ్గుతుంటుంది. అందుకే ఈ సీజన్‌లో ఆహారం విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చలికాలంలో శరీరానికి వెచ్చదనాన్ని, శక్తిని ఇచ్చే డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం ఎంతో మేలు. వీటిలో ఖర్జూరాలు అత్యంత కీలకమైనవి. అయితే ఖర్జూరాలను సాధారణంగా తినడం కంటే నెయ్యిలో లేదా నేరుగా వేయించి తినడం వల్ల రెట్టింపు ప్రయోజనాలు ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఢిల్లీకి చెందిన ప్రముఖ ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ చంచల్ శర్మ అభిప్రాయం ప్రకారం.. కాల్చిన ఖర్జూరాలు శరీర ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఖర్జూరాల్లో ఉండే ఐరన్, ఖనిజాలు మహిళల్లో హార్మోన్ల స్థాయిలను నియంత్రిస్తాయి. ఇవి మహిళల్లో అండోత్సర్గము ప్రక్రియ సజావుగా సాగడానికి తోడ్పడతాయి, తద్వారా గర్భధారణ అవకాశాలు మెరుగుపడతాయి. పురుషుల్లో సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో కాల్చిన ఖర్జూరాలు అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి స్పెర్మ్ నాణ్యతను పెంచి వంధ్యత్వ సమస్యలను దూరం చేస్తాయి. శరీరం రాత్రిపూట తనను తాను మరమ్మతు చేసుకుంటుంది. కాబట్టి రాత్రి పడుకునే ముందు కాల్చిన ఖర్జూరాలను తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ఖర్జూరాలను దోరగా వేయించి, గోరువెచ్చని పాలతో కలిపి తీసుకుంటే పూర్తిస్థాయి పోషకాలు అందుతాయి. ఖర్జూరాలు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ, అందరికీ సెట్ కాకపోవచ్చు. డాక్టర్ చంచల్ శర్మ హెచ్చరిక ప్రకారం.. ఈ క్రింది సమస్యలు ఉన్నవారు వీటిని తినకపోవడమే మంచిది..

షుగర్ లెవల్స్ అదుపులో లేని వారు ఖర్జూరాలకు దూరంగా ఉండాలి. లివర్ వ్యాధులు ఉన్నవారు వైద్యుని సలహా మేరకే తీసుకోవాలి.

# చలికాలంలో జుట్టు సమస్యలా?




శీతాకాలంలో వాతావరణం చల్లగా ఉండటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ కాలంలో ఎంత జాగ్రత్తగా ఉన్నా చర్మం, జుట్టు సమస్యలు చుట్టుముడతాయి. ముఖ్యంగా ఈ కాలంలో జుట్టు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. శీతాకాలంలో వాతావరణం చల్లగా ఉండటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ కాలంలో ఎంత జాగ్రత్తగా ఉన్నా చర్మం, జుట్టు సమస్యలు చుట్టుముడతాయి. ముఖ్యంగా ఈ కాలంలో జుట్టు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. లేదంటే చుండ్రు, జుట్టు చిట్లడం, జుట్టు రాలడం ప్రారంభమవుతుంది. ఫలితంగా జుట్టు రాలిపోతుంది. జుట్టు సంరక్షణకు ఖరీదైన రసాయనాలతో కూడిన ఉత్పత్తులను పూయడానికి బదులుగా ఇంటి నివారణలను ప్రయత్నించడం వల్ల రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. ఇది జుట్టు బాగా, అందంగా పెరగడానికి సహాయపడుతుంది. జుట్టుకు మేలు చేసే పదార్థాల్లో ఉసిరి ముందు వరుసలో ఉంటుంది. ఇది జుట్టుకు చాలా మేలు చేస్తుంది. ఇందులో విటమిన్ సి, ఐరన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది జుట్టు సమస్యలను తొలగించడంలో సహాయపడుతుంది. ఉసిరి జుట్టు మూలాలను బలపరుస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. తలలో రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. అందువల్ల జుట్టుకు ఉసిరితో తయారు చేసిన హెయిర్ మాస్కులు వినియోగించవచ్చు. ఉసిరిని జుట్టుకు పూయడం కంటే ఖాళీ కడుపుతో ఉసిరి రసం తాగడం వల్ల మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఉసిరి జ్యూస్ చర్మానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

దాదాపు ప్రతి ఇంటి వంటగదిలో ఉల్లిపాయలు కనిపిస్తాయి. శాఖాహారుల నుంచి మాంసాహారుల వరకు అందరూ ఉల్లిపాయలు తింటారు. ఎందుకంటే ఉల్లిపాయలు లేకుండా ఏ వంట పూర్తికాదు. అంతేకాదు ఇవి లేనితే వంటలకు రుచి కూడా రాదు. దాదాపు ప్రతి ఇంటి వంటగదిలో ఉల్లిపాయలు కనిపిస్తాయి. శాఖాహారుల నుంచి మాంసాహారుల వరకు అందరూ ఉల్లిపాయలు తింటారు. ఎందుకంటే ఉల్లిపాయలు లేకుండా ఏ వంట పూర్తికాదు. అంతేకాదు ఇవి లేనితే వంటలకు రుచి కూడా రాదు. అందుకే చాలా మంది వీటిని అధిక మొత్తంలో మార్కెట్లో కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసుకుంటూ ఉంటారు. కానీ ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం

# మొలకెత్తిన ఉల్లిపాయలు తినొచ్చా?

వల్ల ఉల్లి మొలకెత్తడం చూస్తూనే ఉంటాం. ఇలా మొలకెత్తిన ఉల్లిని తినడం సురక్షితమేనా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ విధంగా మొలకెత్తిన ఉల్లిపాయలను తినకూడదని కొందరు భావిస్తుంటారు. కానీ మరికొందరు మాత్రం మొలకెత్తిన ఉల్లి ఆరోగ్యానికి చాలా మంచిదని, దీనిని తినడంలో ఎటువంటి సమస్య లేదని చెబుతున్నారు. నిల్వ ఉల్లిపాయలకు వచ్చే పచ్చి మొలకలు విషపూరితమైనవి కావు. నిజానికి ఉల్లిపాయ పాతబడి కొంత తేమను పొందినప్పుడు అది మళ్ళీ మొలకెత్తడం ప్రారంభమవుతుంది. రోజులు గడిచేకొద్దీ దాని నుంచి పచ్చని ఆకు ఉద్భవిస్తాయి. ఈ ఆకులు తినడం ఆరోగ్యానికి మంచిది. భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కానీ ఉల్లిపాయలు తినడానికి సురక్షితమే అయినప్పటికీ వాటి లక్షణాలలో కొన్ని మార్పులు సంభవిస్తాయి. ఉల్లిపాయలు మొలకెత్తినప్పుడు, లోపలి భాగం కొద్దిగా మృదువుగా, లేతగా మారుతుంది. ఈ ఉల్లిపాయలు సాధారణ ఉల్లిపాయల మాదిరిగా రుచిగా ఉండకపోవచ్చు. వాటికి కొంచెం చేదు రుచి ఉంటుంది. మీరు వంట చేసేటప్పుడు మొలకలను కోసి సలాడ్లు వంటి ఇతర ఆహారాలలో వాడవచ్చు. వాటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వాటిని తినడం ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ మొలకెత్తిన ఉల్లిపాయ నొక్కినప్పుడు చాలా మృదువుగా లేదా పొడిగా ఉంటే, అలాగే వాటిపై నల్ల మచ్చలు ఉంటే అలాంటి వాటిని ఉపయోగించవద్దు. ఇటువంటి ఉల్లిపాయలు ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



# న్యూఇయర్ అంతా హ్యాపీగా ఉండాలంటే!



కొత్త ఏడాది వస్తోందంటే చాలా మంది తాము చేయాల్సిన పనులను నిర్దేశించుకుంటారు. పెండింగ్ పనులను పూర్తి చేయడం, కొత్త పనులను ప్రారంభించడం లాంటి అంశాలను తీర్మానించుకుంటారు. అయితే, ఏడాదంతా ఆనందంగా సానుకూల శక్తితో ఉండాలంటే నూతన సంవత్సరం తొలి రోజున కొన్ని ప్రత్యేకమైన పనులు చేయాల్సి ఉంటుందని వాస్తు శాస్త్రం చెబుతోంది. మరో నాలుగు రోజుల్లో మనమందరం కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నాం. దీంతో చాలా మంది కొత్త సంవత్సరం తమకు అనుకూలంగా ఉండాలని కోరుకుంటారు. అంతేగాక, తాము చేయాల్సిన పనులను షెడ్యూల్ చేసుకుంటూ ఉంటారు. ఈ సంవత్సరం పెండింగ్‌లో ఉన్న పనులను కొత్త ఏడాదిలో పూర్తి చేయాలని నిర్ణయించుకుంటారు. కొత్త సంవత్సరం తొలి రోజు సంతోషంగా గడిపితే ఏడాదంతా ఆనందంగా ఉంటారని చాలా మంది నమ్ముతుంటారు. ఈ క్రమంలో నూతన సంవత్సరం ప్రారంభరోజు అందరికీ కీలకంగా మారనుంది. కొత్త ఏడాది పొడవునా మీకు సానుకూలంగా ఉండాలంటే మొదటి రోజు అంటే జనవరి 1, 2026 ఈ పని చేయాలి. మీ ఇంటిపై చెడు కళ్లు పడకుండా ఉండేందుకు, శాంతి, ఆనందం నెలకొనేందుకు ఆరోజు ఇలా చేయాలి. కొత్త సంవత్సరం తొలి రోజున ఇంటిని పూర్తిగా శుభ్రం చేయండి. ఉదయమే స్నానం చేసి పూజ పూర్తి చేసుకోండి. ఆ తర్వాత ఇంటి అంతటా గంగాజలం(నీరు) చల్లుకోండి. ముఖ్యంగా ఒక పాత్రను నీటితో నింపి మీ ఇంటి ప్రధాన ద్వారం దగ్గర ఉంచండి. ఈ పాత్రను ఏదైనా లోహంతో తయారుచేసినదై ఉండేలా చూసుకోండి. ఇత్తడి లేదా రాగిదేతే ఇంకా మంచిది. ఉదయం నుంచి రాత్రి వరకు దీన్ని ఒకే చోట ఉంచండి. వాస్తు శాస్త్రం ప్రకారం నూతన సంవత్సరం రోజున ఒక పాత్రలో నీటితో నింపి ఇంటి ప్రధాన ద్వారా దగ్గర ఉంచడం వల్ల ఇల్లు సానుకూల శక్తితో నిండిపోతుంది. కొత్త సంవత్సరం మొదటి రోజున ఇంటి లోపలి భాగం మాత్రమే కాకుండా ఇంటి ప్రధాన ద్వారా, ఇంటి ప్రాంగణం అంతా కూడా శుభ్రం చేసుకోవాలి. ఇంటి తలుపు వద్ద మురికి చెప్పులు, షూలు ఉంచరాదు. మీ ఇంట్లో ఏవైనా విరిగిన లేదా దెబ్బతిన్న వస్తువులు ఉంటే.. కొత్త ఏడాదికి 3-4 రోజుల ముందే వాటిని పారవేయండి. పగిలిన గాజును కూడా ఇంట్లో ఉంచకూడదు. మీ దగ్గర ఉన్న గడియారం పనిచేయకపోతే.. దాన్ని కూడా సరిచేయండి. పూర్తిగా దెబ్బతింటే పారవేయండి. ఇక, నూతన సంవత్సరం రోజున మొక్కలు నాటడం మంచిది. అయితే, ముళ్ల మొక్కలను నాటవద్దు. తులసీ లేదా మనీ ప్లాంట్ నాటవచ్చు. వాస్తు ప్రకారం ఈ పనులు చేయడం వల్ల మీ ఇల్లు సానుకూల శక్తితో నిండిపోతుంది.

# గుండెను కాపాడే ఈ సూపర్ ఫుడ్





ఈ దుంప మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ప్రభావవంతంగా ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరస్తుంది.. అలాగే.. సామర్థ్యాన్ని పెంచుతుంది.. అందుకే డైటీషియన్లు వారానికి ఒకసారైనా బీట్‌రూట్ తినమని సిఫార్సు చేస్తారు. బీట్‌రూట్.. పోషకాలు అధికంగా ఉండే ఒక దుంప కూరగాయ.. బీట్రూట్‌లో ఐరన్, పొటాషియం, ఫోలేట్, విటమిన్ సి, ఫైబర్.. ఇలా చాలా పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి.. అందుకే.. దీనిని సూపర్ ఫుడ్‌గా పేర్కొంటారు ఆరోగ్య నిపుణులు.. మొత్తంగా బీట్‌రూట్ పోషకాల గనిగా పరిగణిస్తారు. ఇది మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ప్రభావవంతంగా ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరస్తుంది.. అలాగే.. సామర్థ్యాన్ని పెంచుతుంది.. అందుకే డైటీషియన్లు వారానికి ఒకసారైనా బీట్‌రూట్ తినమని సిఫార్సు చేస్తారు. మీ గుండె ఆరోగ్యానికి బీట్‌రూట్ ఒక వరం లాంటిది. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. బీట్‌రూట్‌ను మీ ఆహారంలో సరైన పరిమాణంలో, సరైన మార్గంలో చేర్చుకోవడం వల్ల తీవ్రమైన, ప్రాణాంతకమైన గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. రక్తహీనతను ఎదుర్కోవడానికి బీట్‌రూట్‌ను కూడా సిఫార్సు చేస్తారు. మెదడులో రక్త ప్రసరణను మెరుగుపరచడానికి బీట్‌రూట్ తినవచ్చు. మెదడు పనితీరు, కనెక్టివిటీని మెరుగుపరచడానికి మీరు మీ ఆహార ప్రణాళికలో బీట్‌రూట్‌ను చేర్చుకోవచ్చు. బీట్‌రూట్ కాలేయాన్ని నిర్విషీకరణ చేయడంలో ప్రభావవంతంగా ఉంటుంది. మీరు కొవ్వు కాలేయం (ఫ్యాటీ లివర్) ప్రమాదాన్ని తగ్గించుకోవాలనుకుంటే, బీట్‌రూట్ తీసుకోవడం ప్రారంభించవచ్చు. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల, బీట్‌రూట్ పేగు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణిస్తారు. మీరు తరచుగా అలసటగా, బలహీనంగా అనిపిస్తే.. బీట్‌రూట్ ను తీసుకుంటే.. ఇక తిరుగుండదు.. మీ శక్తిని పెంచడానికి పోషకాలు అధికంగా ఉండే బీట్‌రూట్ తీసుకోవడం ప్రారంభించవచ్చు. బీట్‌రూట్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మీరు అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. బీట్‌రూట్‌ను జ్యూస్, సలాడ్ గా తినవచ్చు.. అలాగే.. కూర, హల్వా కూడా చేసుకుని తినవచ్చు..

# ఎన్నాళ్లకెన్నాళ్లకు.. 14 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై ఇంగ్లండ్ గెలుపు !



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకటి కాదు రెండు కాదు.. వాళ్లది 14 ఏళ్ల కల. ఒక్క మ్యాచ్ అయినా ఆసీస్ ను వాళ్ల సొంత గడ్డపై ఓడించాలి.. అదే తమకు సిరీస్ గెలిచినంత గొప్ప.. అనుకుంటూ కసితో ఎదురు చూస్తున్న టీమ్ కు.. ఎట్టకేలకు సుదీర్ఘ కాలం వేచిన విజయం ఇంగ్లండ్ ఖాతాలో పడింది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టులో కేవలం రెండు రోజుల్లోనే టెస్టును పూర్తి చేసి గెలుపును ఖాతాలో వేసుకుంది ఇంగ్లండ్ టీమ్. రెండో ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా ను కేవలం 132 రన్స్ కే ఆలౌట్ చేసిన ఇంగ్లండ్.. ముందున్న 175 రన్స్ లక్ష్యాన్ని రెండో రోజు సాయంత్రం వరకే ఛేదించింది. 3-1 తేడాతో సిరీస్ ఆస్ట్రేలియా సొంతం చేసుకున్నప్పటికీ.. 14 ఏళ్ల తర్వాత దక్కిన గెలుపు కిక్కును ఎంజాయ్ చేస్తున్నారు ఇంగ్లండ్ ప్లేయర్లు. ఈ సందర్భంగా ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్ మాట్లాడుతూ.. ఇది చాలా చాలా స్పెషల్ మ్యాచ్ అని చెప్పుకొచ్చాడు. మెల్ బోర్న్ క్రికెట్ గ్రౌండ్ లో గెలవటం చాలా ప్రత్యేకం అని ఆనందాన్ని పంచుకున్నాడు. 2011 నుంచి ఆస్ట్రేలియాలో ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఇంగ్లండ్ గెలవక పోవడం గమనార్హం.

**మెల్ బోర్న్ టెస్ట్ స్కోర్స్:**

ఆస్ట్రేలియా: ఫస్ట్ ఇన్నింగ్స్: 152: నేసర్ 35బీ టంగ్ 5-45 & సెకండ్ ఇన్నింగ్స్ 132: హెడ్ 46బీ కార్స్ 4-34

ఇంగ్లాండ్: ఫస్ట్ ఇన్నింగ్స్ 110: బ్రూక్ 41బీ నేసర్ 4-45 & సెకండ్ ఇన్నింగ్స్ 178-6: బెథెల్ 40, క్రాలీ 37

# విజయ్ హజారే ట్రోఫీ: ఒక్కో మ్యాచ్‌కు కోహ్లీ, రోహిత్ ఎంత శాలరీ తీసుకుంటారో తెలుసా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలా రోజుల తర్వాత కోహ్లీ, రోహిత్ లాంటి స్టార్ ప్లేయర్స్ విజయ్ హజారే ట్రోఫీ ఆడటం ఆసక్తికరంగా మారింది. ఎన్నో ఇంటర్నేషనల్ మ్యాచ్ లు ఆడినా, ఎన్నో రికార్డులు సాధించినప్పటికీ లోకల్ వైట్ బాల్ క్రికెట్ కూడా ఆడాల్సిందేనన్న బీసీసీఐ ఆదేశాలతో వీరిద్దరూ రంగంలోకి దిగి దుమ్ములేపుతున్నారు. సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. విజయ్ హజారే ట్రోఫీ ఐపీఎల్ లాంటి కిక్కు ఇవ్వకపోయినా.. రోకో ఎంట్రీతో ఫుల్ ఫోకస్ లోకి వచ్చింది. అయితే ఐపీఎల్ లో కోట్లు తీసుకునే ఈ స్టార్ ప్లేయర్లు ఈ వైట్ బాల్ క్రికెట్ లో మ్యాచ్ కు ఎంత తీసుకుంటారు అనే చర్చ నడుస్తోంది. ఇద్దరూ బీసీసీఐ కాంట్రాక్ట్ ప్లేయర్స్ అయిన ప్పటికీ.. ఐపీఎల్ లో సంపాదించినంత ఈ ట్రోఫీలో ఇవ్వరు. 2025-26 సీజన్ చెల్లింపుల వివరాలు ఇలా ఉన్నాయి.

**విజయ్ హజారే ట్రోఫీ శాలరీ విధానం:**

ఐపీఎల్ లాంటి సిరీస్ లలో ప్లేయర్లకు వేలం ద్వారా చెల్లిస్తుండగా.. విజయ్ హజారే ట్రోఫీలో శాలరీలు ఫిక్సుడుగా ఉంటాయి. ఒక ప్లేయర్ ఎన్ని లిస్ట్-A మ్యాచ్ లు ఆడాడు అనేదే ఇక్కడ ప్రాతిపదిక.

**ఒక్కో గేమ్ కు మ్యాచ్ ఫీ:**

**సీనియర్ కేటగిరి: (40 కి పైగా మ్యాచ్ లు ఆడినవారు)**

ప్లేయింగ్ లెవెన్ లో ఉంటే మ్యాచ్ కు రూ.60 వేలు

రిజర్వ్ లో ఉంటే మ్యాచ్ కు రూ.30 వేల శాలరీ

మిడ్ లెవెల్ కేటగిరీ: (21 నుంచి 40 మ్యాచ్ లు)

ప్లేయింగ్ XI: మ్యాచ్ కు రూ. 50 వేలు

రిజర్వ్ : మ్యాచ్ కు రూ 25 వేలు

జూనియర్ కేటగిరీ: (0 నుంచి 20 మ్యాచ్ లు)

ప్లేయింగ్ XI: మ్యాచ్ కు రూ. 40 వేలు

రిజర్వ్ : మ్యాచ్ కు రూ 20 వేలు

**కోహ్లీ, రోహిత్ ఎంత సంపాదిస్తారంటే..**

ప్రస్తుత సీజన్ లో కోహ్లీ ఢిల్లీకి, రోహిత్ ముంబైకి ఆడుతున్నారు. ఇద్దరూ 40 కి పైగా మ్యాచ్ లు ఆడారు కాబట్టి.. ఒక్కో గేమ్ కు వాళ్లు 60 వేల రూపాయలు శాలరీ పొందుతారు. బీసీసీఐ వన్డే మ్యాచ్ తో పోల్చినప్పుడు.. ఒక్క వన్డే మ్యాచ్ కు 6 లక్షల రూపాయలు ఇస్తుంటుంది బీసీసీఐ. కానీ ఇక్కడ కేవలం 60 వేలతో సరిపెట్టుకోవాలి. దీనితో పాటు ట్రావెల్, ఫుడ్, అకామొడేషన్ అలొవెన్స్ లు ఉంటాయి.

ఇక ఈ ట్రోఫీలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కు పర్ఫామెన్స్ బోనస్ కింద.. రూ.10 వేల క్యాష్ ప్రైజ్ ఉంటుంది. అయితే మ్యాచ్ కు 60 వేల రూపాయలు తీసుకుంటున్న కోహ్లీ, రోహిత్.. పర్ఫామెన్స్ ప్రైజ్ ప్రకారం మరింత సంపాదించే అవకాశం ఉంది.

# బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ లో విషాదం... మ్యాచ్ కు ముందు అసిస్టెంట్ కోచ్ హఠాన్మరణం

**మ్యాచ్‌కు ముందు గ్రౌండ్‌లో కుప్పకూలిన ఢాకా క్యాపిటల్స్ అసిస్టెంట్ కోచ్**

**ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యుల నిర్ధారణ**

**మహబూబ్ అలీ జకీ మృతిపై బంగ్లాదేశ్ బోర్డు సంతాపం**



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (BPL)లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఢాకా క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జకీ (59) హఠాన్మరణం చెందాడు. ఇవాళ సిల్హెట్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రాజ్‌షాహీ వారియర్స్‌తో మ్యాచ్ ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు ఈ దురదృష్టకర ఘటన జరిగింది.వివరాల్లోకి వెళితే, మ్యాచ్‌కు ముందు జట్టు ప్రాక్టీస్ చేస్తుండగా, జకీ మైదానంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే అప్రమత్తమైన జట్టు సిబ్బంది, వైద్యులు అతడికి సీపీఆర్ (CPR) చేసి, అంబులెన్స్‌లో సమీపంలోని అల్ హరమైన్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే మహబూబ్ అలీ జకీ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనతో మైదానంలో ఉన్నవారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. జకీకి ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, అతడడి ఆకస్మిక మరణం తమను తీవ్రంగా కలచివేసిందని జట్టు అధికారులు తెలిపారు.జకీ మృతికి సంతాపంగా మ్యాచ్‌కు ముందు ఆటగాళ్లు, అధికారులు ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం మ్యాచ్ యథావిధిగా కొనసాగింది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఈ ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. దేశ క్రికెట్‌కు, ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ల అభివృద్ధికి జకీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడింది. ఒకప్పుడు ఫాస్ట్ బౌలర్‌గా రాణించిన జకీ, కొమిల్లా జిల్లాకు, దేశంలో ప్రముఖ క్లబ్ అయిన అబాహనీ లిమిటెడ్‌కు ప్రాతినిధ్యం వహించాడు.



**మస్టర్డ్ లెహంగాలో స్టన్స్ చేసిన శ్రీలీల: పాన్-ఇండియన్ స్టార్ గ్లామరస్ ఫోటోషూట్**

# సౌత్ లో నటి కెరీర్ ఊహించని విధంగా!



మృణాల్ ఠాకూర్ అలియాస్ సీతమ్మ సినీ ప్రయాణం గురించి చెప్పాల్సిన పనిలేదు. సీరియల్స్ తో మొదలైన అమ్మడి జర్నీ హీరోయిన్ గా దిగ్విజయంగా కొనసాగుతోంది. మరాఠీ నుంచి బాలీవుడ్ ని దాటుకుని టాలీవుడ్ వరకూ తిరుగులేని ప్రయాణం ఆమె సొంతం. మారాఠీలో – హలో నందన్ – , బాలీవుడ్ లో – లవ్ సోనియా – తో కెరీర్ ప్రారంభించి బాలీవుడ్ లో అనతి కాలంలో బిజీ హీరోయిన్ గా మారింది. – సూపర్ 30 – బట్లా హౌస్ ఘోస్ట్ స్టోరీస్ – లాంటి చిత్రాలు అమ్మడికి హిందీలో సరైన ఫౌండేషన్ వేయడంతో సక్సెస్ ఫుల్ గా కొనసాగుతోంది. టాలీవుడ్ లో – జెర్సీ– సీతారామం– లాంటి విజయాలు అమ్మడికి ఎనలేని గుర్తింపును తీసుకొచ్చాయి. ఆ చిత్రాల సక్సెస్ తోనే తాను బిజీ కాలేదు. అంతకు మించి గొప్ప పెర్ఫార్మర్ కావడంతోనే అన్నది కాదనలేని నిజం. పాత్రల విషయంలో ఎంతో సెలక్టివ్ గా ఉంటుంది. తాను ఎంపిక చేసుకునే పాత్రల్లోనే గ్లామర్ అప్పిరియన్స్ ఉండేలా చూసుకుంది. ఈ విషయంలో మృణాల్ ఎంతో తెలివైన నిర్ణయాలతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం బాలీవు డ్..టాలీవుడ్ అంటూ రెండు భాషల్ని దున్నేస్తుంది. పారితోషికం పరంగా భారీగానే అందుకుంటుంది. దర్శక, రచయితలు మృణాల్ ని దృష్టిలో పెట్టుకునే పాత్రలు రాస్తున్నారంటే? నటనలో తానేస్థాయికి చేరిందన్నది అంచనా వేయొచ్చు. అయితే తెలుగులో అమ్మడి జర్నీ మాత్రం ఇంత గొప్పగా సాగుతుందని తాను కూడా ఊహించలేదంది. నటిగా తన ప్రయాణమంతా హిందీ చిత్ర పరిశ్రమలో అనుకునే జర్నీ మొదలు పెట్టినట్లు తెలిపింది. సీరియల్స్ లో నటించడం ప్రారంభించినా తర్వాత నటిగా ఏ హైట్స్ కు చేరుకోవాలన్నా? బాలీవుడ్ తప్ప మరో పరిశ్రమ ఆలోచన లేకుండానే చాలా కాలం కొనసాగినట్లు గుర్తు చేసుకుంది.తెలుగు లో సక్సెస్ అనంతరం ఇక్కడి అభిమానులు చూపించిన ప్రేమకు తానెంతో ఫిదా అయ్యానంది. వాళ్లకెప్పుడు తాను రుణపడే ఉంటానంది. ఇక్కడింత గొప్ప ప్రయాణం ఉంటుందని ఏనాడు భావించ లేదని..సినిమాలు చేయడం ప్రారంభిం చిన తర్వాత ఇక్కడ నటులకు ఎంత ప్రాధాన్యత ఉంటుంది? గౌరవ, మర్యాద ఉంటాయన్నది అర్ధమైంది అంది. ఈ బ్యూటీ ఇంకా కోలీవుడ్ లో అడుగు పెట్ట లేదు. కేవలం టాలీవుడ్ అభిమానంతోనే ఇంతగా మురిసిపోతుందంటే? అరవ అభిమానులు ప్రేమ కురిపిస్తే ఎలా ఉంటుందో? అక్కడా సక్సెస్ అయిన తర్వాత అర్ధమవుతుంది. అలాగే పాన్ ఇండియాలో వెలిగిపోతున్న కన్నడ, మలయాళ పరిశ్రమ లోనూ అంతే గౌరవం, గుర్తింపు దక్కుతాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com